www.asthram.com
RNI : TGTEL/25/A1872

సామాన్యుడి

# అస్త్రం

తెలుగు దినపత్రిక

సోమవారం 4 ఆగస్టు 2025
హైదరాబాద్

సంపుటి : 1 సంచిక : 6 పేజీలు : 08 వెల:2/-



## స్మార్ట్ ఫోన్ ఎగుమతుల్లో
# భారత్ ప్రభంజనం


- ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల్లో భారీ వృద్ధి
- గతేడాదితో పోలిస్తే 58 శాతం పెరిగి 7.72 బిలియన్ డాలర్లకు చేరిక
- మొత్తం ఎగుమతుల్లో సింహభాగం యాపిల్ ఐఫోన్లదే
- దాదాపు 78 శాతం వాటాతో యాపిల్ హవా
- పీఎల్ఐ పథకం విజయంతో స్థానిక తయారీకి ఊతం
- భారత్ నుంచి ఎగుమతయ్యే వస్తువుల్లో స్మార్ట్‌ఫోన్లు టా

2



## ఏఐతో కొన్ని ఉద్యోగాలకు
# ముప్పు తప్పదు

- బిల్ గేట్స్ కీలక విశ్లేషణ
- సాధారణ కోడింగ్, టెలిసేల్స్ పనులను ఏఐ చేయగలదని తెలిపిన బిల్ గేట్స్
- సంక్లిష్టమైన కోడింగ్ సవాళ్లను అధిగమించడానికి ఇంకా సమయం పడుతుందని వెల్లడి
- పారాలీగల్స్, ఎంట్రీ-లెవెల్ అకౌంటెంట్ల వంటి ఉద్యోగాలకు ముప్పు తప్పదని అంచనా
- ఏఐ పురోగతి వేగం తనను చాలా ఆశ్చర్యపరిచిందని ఆయన వ్యాఖ్య




# యూరియా కొరత

## వరినాట్లు ఊపందుకోవడంతో పెరిగిన డిమాండ్

హైదరాబాద్

ఇటీవలి వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలో వరి నాట్లు ఊపందుకున్నాయి. దీంతో ఎరువుల కోసం డిమాండ్ పెరుగుతోంది. ముఖ్యంగా అవసరమైన మొత్తంలో యూరియా కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. అయితే తీవ్రమైన కొరత నేపథ్యంలో ప్రభుత్వం రేషన్ విధానంలో ఒక్కొక్కరికి రెండు బస్తాలే ఇస్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఈ ఆగస్టు నెలలో రైతుల అవసరాలు తీరాలంటే కనీసం 2 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) యూరియా అవసరమని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కేంద్రం నుంచి ఆ మేరకు యూరియా వస్తేనే గండం గట్టెక్కే అవకాశం ఉంటుందని, లేకపోతే రైతులు రోడ్లు ఎక్కే పరిస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రానికి కేంద్రం వానాకాలం సీజన్‌కు గాను నెలల వారీగా కేటాయించిన 9.80 ఎల్ఎంటీల యూరియాలో కోత పెట్టడంతోనే రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర ప్రభుత్వం చెబుతుండగా.. రాష్ట్రానికి కోటాకు మించి ఎరువులు సరఫరా చేశామంటూ కేంద్ర మంత్రి చేసిన ప్రకటనతో గందరగోళం నెలకొంది. ఇది రైతులకు తప్పుడు సంకేతాలను - మిగతా3లో

# మళ్లీ గులాబీ జెండా ఎగరాలి



హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మళ్లీ గులాబీ జెండా ఎగరాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టిన గ్రేటర్ హైదరాబాద్ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా నన్నారు. బీఆర్ఎస్ పార్టీకి 50వేల మంది కార్యకర్తల సభ్యత్వం ఉన్న నియోజకవర్గం జూబ్లీహిల్స్ - మిగతా3లో

## ప్రజలకు చేరువయ్యేందుకే
# పాదయాత్రలు

- కేసీఆర్ మాటలతోనే.. ఏపీ 'బనకచర్ల' చేపట్టింది
- సర్వే ఆధారంగా స్థానిక ఎన్నికల్లో గెలిచే వారికే సీట్లు
- మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు
- పాలనలో మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తున్నాం
- బోధన్ షుగర్ ఫ్యాక్టరీపై అధ్యయనం జరుగుతోంది
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశాలతోనే పాదయాత్ర ఉంటుంది
- బీఆర్ఎస్‌వి కుల రాజకీయాలు
- "ఎమ్మెల్సీ కవిత ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారో నాకు తెలియదు



## బనకచర్లపై ఎంతవరకైనా
# పోరాడతాం



- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాల మేరకే బనకచర్ల అనుమతులను సీడబ్ల్యూసీ, గోదావరి నదీ యజమాన్య బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ తిరస్కరించాయి
- రాష్ట్ర నీటిపారుదల శాఖ అభ్యంతరాలతో కేంద్రం పర్యావరణ అనుమతులు నిలిపివేసింది
- 84 శాతం మందికి సన్న బియ్యం పంపిణీ

2



# బీఆర్ఎస్‌లో లొల్లి

- కవిత, జగదీశ్ రెడ్డి మధ్య మాటల తూటాలు!
- బీఆర్ఎస్‌లో తారాస్థాయికి చేరిన నేతల మధ్య విభేదాలు
- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర స్థాయిలో విమర్శలు
- జగదీశ్ రెడ్డి ఓ 'లిల్లిపుట్' అని, కేసీఆర్ లేకపోతే ఆయనెవరని వ్యాఖ్య
- తనపై కొందరు పార్టీ నేతలే కుట్ర చేస్తున్నారని కవిత ఆరోపణ
- కవిత వ్యాఖ్యలకు జగదీశ్ రెడ్డి ఘాటుగా బదులు, సెటైర్లు
- కేసీఆర్ శత్రువుల మాటలను కవిత వాడుతున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపణ



హైదరాబాద్

బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిపై పరోక్షంగా - మిగతా3లో

# యూరియా కొరత

-మొదటిపేజీ తరువాయి

ఇస్తుందని, గ్రామాల్లో యూరియా కోసం ఆందోళనలు పెరిగే అవకాశం ఉందని రాష్ట్ర అధికారులు అంటున్నారు.

**చర్చనీయాంశమైన కేంద్రమంత్రి ప్రకటన**

రాష్ట్రంలో యూరియా కొరత తీవ్ర రూపం దాల్చే పరిస్థితి ఉందని ప్రభుత్వం ఆందోళన చెందుతున్న నేపథ్యంలో, లోక్‌సభలో కేంద్ర సహాయ మంత్రి అనుప్రియా పటేల్ చేసిన ప్రకటన చర్చనీయాంశమైంది. తెలంగాణకు ఈ ఖరీఫ్ (వానాకాలం) సీజన్‌లో అవసరమైన 20.30 ఎల్‌ఎంటీల కన్నా అధికంగా 22.15 ఎల్‌ఎంటీలు సరఫరా చేసినట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. దీంతో బిత్తరపోవడం రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల వంతయ్యింది. వాస్తవానికి ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి.. యూరియాతో పాటు డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్, ఎస్ఎస్‌పీ ఎరువులు కలిపి 22.15 ఎల్‌ఎంటీ ఇచ్చినట్లు చెప్పాల్సిన కేంద్ర మంత్రి.. కేవలం యూరియానే 22.15 ఎల్‌ఎంటీ సరఫరా చేసినట్లుగా చెప్పారని ఓ అధికారి వివరించారు. నిజానికి ఇప్పటివరకు ఇచ్చిన యూరియా 4.50 ఎల్‌ఎంటీలు మాత్రమేనని చెప్పారు.

**అసలు లెక్కలేంటి?**

రాష్ట్రంలో పంటల విస్తీర్ణం భారీగా పెరిగింది. ఈ వానాకాలంలో ఏకంగా 134 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో 10.48 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. కానీ కేంద్రం ఈ సీజన్‌కు గాను నెలవారీగా 9.80 ఎల్‌ఎంటీలు మాత్రమే కేటాయించింది. అదేమంటే యాసంగి సీజన్‌లో మిగిలిన యూరియా 1.92 ఎల్‌ఎంటీ గోదాముల్లో ఉందని, దాన్ని వినియోగించుకోవాలని సూచించింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ సమాచారం మేరకు.. ఏప్రిల్ నుంచి జూలై వరకు కేంద్రం 6.60 ఎల్‌ఎంటీల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా 4.50 ఎల్‌ఎంటీలే వచ్చింది. అంటే 2.10 ఎల్‌ఎంటీ (32 శాతం) తక్కువగా వచ్చిందన్న మాట. దీనికి రాష్ట్రం వద్ద ప్రారంభ నిల్వ కింద ఉన్న యూరియా 1.92 ఎల్‌ఎంటీలు కలిపితే మొత్తం 6.42 ఎల్‌ఎంటీలు అందుబాటులోకి వచ్చినట్టయ్యింది. ఇందులో సుమారు 5.20 ఎల్‌ఎంటీలు ఇప్పటికే రైతులకు విక్రయించగా.. 1.20 ఎల్‌ఎంటీల పైచిలుకు నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సీజన్‌లో రాష్ట్రానికి కేటాయించిన 9.80 ఎల్‌ఎంటీలకు గాను జూలై వరకు 4.50 ఎల్‌ఎంటీలు సరఫరా చేసిన నేపథ్యంలో ఇంకా 5.30 ఎల్‌ఎంటీల యూరియా రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నాలుగు నెలల్లో కోత విధించిన 2.10 ఎల్‌ఎంటీలతో పాటు ఆగస్టు కోటా 1.70 ఎల్‌ఎంటీలు కలిపి ఈ నెలలో సరఫరా చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇప్పటికే కేంద్రాన్ని కోరారు. కాగా ఇటీవల కేంద్ర మంత్రి ప్రకటన నేపథ్యంలో అధికారులు సమావేశమై యూరియా కొరత పరిస్థితిని సమీక్షించారు. ఆగస్టులో కనీసం 2 ఎల్‌ఎంటీల యూరియా అయినా వస్తేనే ప్రస్తుతానికి గట్టెక్కే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు మంత్రి తుమ్మల కూడా తాజాగా కేంద్ర మంత్రి అనుప్రియా పటేల్‌కు లేఖ రాశారు. రాష్ట్రానికి యూరియా కేటాయింపులు, ఇప్పటివరకు కేంద్రం నుంచి వాస్తవంగా వచ్చిన యూరియా వివరాలు తెలియజేశారు. రాష్ట్రంలో కొరతను దృష్టిలో పెట్టుకుని తక్షణమే అవసరమైన యూరియాను పంపించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజలకు చేరువయ్యేందుకే పాదయాత్రలు

**నిజామాబాద్:** స్థానికల సంస్థల ఎన్నికలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సర్వే ఆధారంగా స్థానిక ఎన్నికల్లో గెలిచే వారికే సీట్లు ఇస్తామని స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు పదవులు ఇస్తామని ఉద్ఘాటించారు. కొత్త వారు వచ్చినా పాత నేతలకు పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని చెప్పుకొచ్చారు. కార్యకర్తలను కాపాడుకునే బాధ్యత తమదని హామీ ఇచ్చారు. ఇవాళ(ఆదివారం) నిజామాబాద్‌లో కాంగ్రెస్ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ పాల్గొని మాట్లాడారు.

పాలనలో మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తున్నామని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీపై అధ్యయనం జరుగుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశాలతోనే పాదయాత్ర ఉంటుందని క్లారిటీ ఇచ్చారు. ఈ పాదయాత్రపై కొన్ని మీడియా సంస్థలు తప్పుడు రాతలు రాస్తున్నాయని మండిపడ్డారు. ప్రజలకు చేరువయ్యేందుకే పాదయాత్రలు చేస్తున్నామని ఉద్ఘాటించారు మహేష్ కుమార్ గౌడ్. మాజీ సీఎం కేసీఆర్ అప్పులు చేసి ఫామ్ హౌస్‌కు పరిమితమయ్యారని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు.



బీఆర్ఎస్‌వి కుల రాజకీయాలని ఆక్షేపించారు. బనకచర్ల ప్రాజెక్టుపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు అబద్ధాలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియా ద్వారా ఎల్లో జర్నలిజం నడిపిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని ప్రశ్నించారు. అధికారంలో ఉండగా ఏనాడైనా బీసీల గురించి కవిత మాట్లాడారా అని మహేష్ కుమార్ గౌడ్ నిలదీశారు.

**కేసీఆర్ మాటలతోనే.. ఏపీ 'బనకచర్ల' చేపట్టింది: మహేశ్‌కుమార్ గౌడ్**

గోదావరిలో 3 వేల టీఎంసీల మిగులు జలాలు ఉన్నాయని, వాటిని ఏపీ వాడుకోవచ్చని గతంలో కేసీఆర్ అన్నారని.. అందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేసిందని చెప్పారు. తెలంగాణను వదిలేసి రాయలసీమను రతనాల సీమ చేస్తానని కేసీఆర్ వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో తెలంగాణ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. నిజామాబాద్ జిల్లాలో కొనసాగుతున్న జనహిత పాదయాత్ర సందర్భంగా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఎమ్మెల్సీ కవిత ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారో నాకు తెలియదు. కులగణన కోసం దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ పోరాటం చేశారు. ఆయన కోరిక మేరకు సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో కులగణన చేపట్టారు. అలాంటిది ఇప్పుడు బీసీలపై కవిత ప్రేమ ఒలకబోస్తున్నారు." అని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి సీతక్కతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# బనకచర్లపై ఎంతవరకైనా పోరాడతాం

**ధర్మారం/పెద్దపల్లి:** ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఎంతవరకైనా పోరాడతామని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాల మేరకే బనకచర్ల అనుమతులను సీడబ్ల్యూసీ, గోదావరి నదీ యజమాన్య బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ తిరస్కరించాయన్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ అభ్యంతరాలతో కేంద్రం పర్యావరణ అనుమతులు నిలిపివేసిందన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఉత్తమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఇటీవల ఢిల్లీలో జరిగిన రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో బనకచర్లపై తమ వాదనలు గట్టిగా వినిపించామని మంత్రి చెప్పారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర విభజన చట్టం, 1980–గోదావరి నదీజలాల పంపిణీ ఒప్పందాలకు వ్యతిరేకంగా ఉందన్నారు. ఇవన్నీ తెలిసిన భారత రాష్ట్ర సమితి నేతలు బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని ఉత్తమ్ విమర్శించారు.

**84 శాతం మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం**

రాష్ట్ర జనాభాలో 84 శాతం మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 89 లక్షల రేషన్‌కార్డులు ఉండగా.. తమ ప్రభుత్వం వచ్చాక ఆ సంఖ్య 98.59లక్షలకు చేరిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా 8.64లక్షల కొత్త కార్డులు జారీ చేసిందని తెలిపారు. గతంలో 2.81కోట్ల మందికి నాసిరకమైన దొడ్డు బియ్యం పంపిణీ చేశారని.. ఇప్పుడు 3.17కోట్ల మందికి నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నామని మంత్రి వివరించారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన దొడ్డు బియ్యం ఎవరూ తినడం లేదనే ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు.

**కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్ షాకింగ్ కామెంట్స్**

కాళేశ్వరం ప్రాజెక్ట్ నివేదికపై కేబినెట్‌లో చర్చిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరంపై కేబినెట్‌లో చర్చించి.. నిర్ణయం తీసుకుంటామని ఉద్ఘాటించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్లు వృథా అయ్యాయని ఆరోపించారు. మేడిగడ్డ వల్ల ఎలాంటి ఉపయోగం లేదని విమర్శించారు. కాళేశ్వరంపై తాను రాజకీయ విమర్శలు చేయడం లేదని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం లేకుండానే.. దేశంలో రికార్డ్ పంటలు పండించామని తెలిపారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఇవాళ(ఆదివారం) పెద్దపల్లి జిల్లాలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో మంత్రి ఉత్తమ్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. ఏపీ మంత్రి నారా లోకేష్ బనకచర్ల ప్రాజెక్టు కడతామని అన్నారని.. ఈ ప్రాజెక్టును తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. బనకచర్లను సీడబ్ల్యూసీ తిరస్కరించిందని గుర్తుచేశారు. బనకచర్ల ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నామని ఢిల్లీలో జరిగిన సమావేశంలో తాము చెప్పామని అన్నారు. పునర్విభజన చట్టానికి బనక చర్ల ప్రాజెక్టు వ్యతిరేకమని వెల్లడించారు. బనక చర్లను కట్టకుండా తాము అడ్డుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

**కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు రాలేదు: మంత్రి శ్రీధర్‌బాబు**

లక్షల కోట్ల రూపాయలతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి పెద్దపల్లి జిల్లాకు చుక్క నీరు రాలేదని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కోట్ల రూపాయలతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ బూడిదలో పోసిన పన్నీరు అయ్యిందని విమర్శించారు. రామగుండంలో ఐటీ కారిడార్ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పుకొచ్చారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి నీళ్లిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు.

## ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాతపెట్టాలి

-మొదటిపేజీ తరువాయి

నియోజకవర్గమని.. ఉప ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలువాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ పథకాలు ఆగిపోయాయన్నారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. అధికారంలోకి వచ్చాక బస్తీల్లో ఉండే పేదల ఇండ్లు కూల్చుతున్నదని మండిపడ్డారు. సీఎం రేవంత్ కొడంగల్ నియోజకవర్గంలో ఎఫ్‌టీఎల్‌లో ఇల్లు కట్టుకున్నాడని.. హైదరాబాద్‌లో రేవంత్, ఆయన సోదరుడు తిరుపతి రెడ్డి ఇల్లు ఎఫ్‌టీఎల్‌లోనే ఉందని.. ఇలా చెప్పుకుంటే పోతే కాంగ్రెస్ నేతల ఇండ్లన్నీ బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లోనే ఉన్నాయన్నారు. కూట్లో రాయి తెయ్యలేని వాడు, ఎట్లో రాయి తీస్తా అని రేవంత్ మాట్లాడుతున్నాడని విమర్శించారు. మాగంటి గోపీనాథ్ చేసిన సేవలకు నివాళిగా, మరొక్కసారి జూబ్లీహిల్స్‌లో గులాబీ జెండా ఎగురవేద్దామని శ్రేణులకు పిలుపునిచ్చారు. 20 నెలల కాంగ్రెస్ అసమర్థ, అవినీతి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఎన్నికల ముందు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే వంటి నేతలంతా వచ్చి తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇప్పుడు తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. మోసగాళ్లకు, మోసగాళ్ల పార్టీ అయిన కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రజలు గట్టి బుద్ధి చెప్పాలని, రానున్న ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టాలన్నారు. 20 నెలల కాంగ్రెస్ మోసాన్ని చూసిన తర్వాత కూడా కాంగ్రెస్‌కు ఓటు వేస్తే, అన్ని సంక్షేమ పథకాలు ఆగిపోతాయన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ గెలిచిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు ఆగిపోయాయని.. మళ్లీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క ఓటు వేసినా, ఉన్న పథకాలన్నీ పోతాయన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం

**సిద్దిపేట జిల్లా:** కాళేశ్వరం ప్రాజెక్టు రిపోర్ట్ వచ్చిన తర్వాత అవినీతికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని మెదక్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వివేక్ వెంకట స్వామి హెచ్చరించారు. జస్టిస్ పీసీ ఘోష్ కాళేశ్వరం ప్రాజెక్టుపై రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. రాజశేఖర్ రెడ్డి హయాంలో తెలంగాణలో సాగునీటి కోసమని రూ.36 వేల కోట్లతో ప్రాణహిత చేవెళ్ల నిర్మించామని ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కమీషన్‌ల కోసమే ఈ ప్రాజెక్టును కాళేశ్వరంలో కలిపారని ఆరోపించారు మంత్రి వివేక్ వెంకట స్వామి. లక్ష కోట్లు ఖర్చు చేశారు కానీ ఇప్పటివరకు కాళేశ్వరం నుంచి 70 టీఎంసీల నీళ్లు పంపు చేసిన నీళ్లు కూడా వృథా అయ్యాయని విమర్శించారు. ఆదివారం గజ్వేల్‌లో రేషన్ కార్డుల పంపిణీ అనంతరం మీడియాతో మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడారు. కేవలం కాంట్రాక్టర్లను ధనికులు చేయడానికి మాత్రమే బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం నిర్మించిందని మంత్రి వివేక్ వెంకట స్వామి పేర్కొన్నారు. మల్లన్నసాగర్‌కు ఎల్లంపల్లి నుంచి నీరు వస్తున్నాయని వివరించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును కాంగ్రెస్ హయాంలో నిర్మించామని గుర్తుచేశారు. తెలంగాణలో 15 లక్షల ఎకరాలకు ఎల్లంపల్లి నుంచి సాగు నీరు వచ్చేదని.. అలాంటి ఎల్లంపల్లి ప్రాజెక్టును కాళేశ్వరంలో కలిపారని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు పంపింగ్ ఫెయిల్ అయిందని మండిపడ్డారు.వంద మీటర్లు పంపింగ్ చేయాలంటే రూ.4 వేల కోట్లు అవసరని వెల్లడించారు మంత్రి వివేక్ వెంకట స్వామి.

**ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం**

'ఒక్క రేషన్ కార్డు ద్వారా ఎంతమంది ఏ ఏ స్కీములు తీసుకున్నారో తెలుస్తుంది. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించాం. కాంగ్రెస్‌ను ప్రజలు ఓట్లు వేసి గెలిపించారు.

## బీఆర్ఎస్‌లో లొల్లి...

-మొదటిపేజీ తరువాయి

విరుచుకుపడ్డారు. జగదీశ్ రెడ్డిని 'లిల్లిపుట్' అంటూ సంబోధించిన కవిత, కేసీఆర్ నీడలో బతికే ఆయనకు సొంత అస్తిత్వం లేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీనిపై జగదీశ్ రెడ్డి కూడా అంతే స్థాయిలో స్పందిస్తూ సెటైరికల్ కౌంటర్ ఇచ్చారు. ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడిన కవిత, తనపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేస్తున్న అనుచిత వ్యాఖ్యల వెనుక బీఆర్ఎస్‌లోని కొందరు ముఖ్య నేతల హస్తం ఉందని సంచలన ఆరోపణలు చేశారు. "పార్టీలోని ఒక అగ్రనేత ప్రోద్బలంతోనే నాపై ఇలాంటి వ్యాఖ్యలు చేయిస్తున్నారు. అందుకే బీఆర్ఎస్ నేతలు ఎవరూ దీనిపై మాట్లాడటం లేదు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జగదీశ్ రెడ్డిని ఉద్దేశిస్తూ, "కేసీఆర్ అనే నీడ లేకపోతే మీరెవరు? నల్గొండ జిల్లాలో పార్టీని నాశనం చేశారు. తర్వాత పార్టీలో చేరిన ఓ చిన్న నేత కూడా నా విశ్వసనీయతను ప్రశ్నించే స్థాయికి వచ్చారు" అని మండిపడ్డారు. తనను ఒంటరిని చేసి, పక్కన పెట్టాలని చూస్తున్నారని, అయితే కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతానని, చేసిన వారికి తగిన ఫలితం దక్కుతుందని కవిత అన్నారు. కొద్ది నెలల క్రితం కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ అయిన నాటి నుంచి కవిత అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. "కేసీఆర్ ఒక దేవుడు, కానీ ఆయన చుట్టూ రాక్షసులు చేరారు" అని ఆమె గతంలో చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తుచేశారు.

**కవిత వ్యాఖ్యలపై జగదీశ్ రెడ్డి స్పందన**

కవిత చేసిన తీవ్ర వ్యాఖ్యలపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కూడా ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు. "నా ఉద్యమ ప్రస్థానానికి సంబంధించి కవితమ్మకు ఉన్న జ్ఞానానికి నా జోహార్లు. కేసీఆర్ శత్రువులైన రేవంత్, రాధాకృష్ణ లాంటి వారు నా గురించి మాట్లాడిన మాటల్ని ఆమె మరొక్కసారి వల్లె వేసేందుకు చేసిన ప్రయత్నానికి నా సానుభూతిని తెలియజేస్తున్నా" అంటూ ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## స్మార్ట్ ఫోన్ ఎగుమతుల్లో భారత్ ప్రభంజనం

భారతదేశం నుంచి స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు సరికొత్త శిఖరాలకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) దేశం నుంచి రికార్డు స్థాయిలో ఎగుమతులు నమోదైనట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మూడు నెలల కాలంలోనే ఏకంగా 7.72 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 64,500 కోట్లు) విలువైన స్మార్ట్‌ఫోన్లు విదేశాలకు ఎగుమతి అయ్యాయి. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది 58 శాతం అధికం కావడం విశేషం. ఈ భారీ వృద్ధిలో టెక్ దిగ్గజం యాపిల్ కీలక పాత్ర పోషించింది. మొత్తం స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల్లో దాదాపు 78 శాతం వాటా ఒక్క యాపిల్ సంస్థదే కావడం గమనార్హం. తన కాంట్రాక్ట్ తయారీదారుల ద్వారా యాపిల్ ఏకంగా 6 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను భారత్ నుంచి ఎగుమతి చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే యాపిల్ ఎగుమతులు 82 శాతం పెరిగాయి. భారతదేశ స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల చరిత్రలో ఒక త్రైమాసికంలో ఇంతటి వృద్ధి నమోదు కావడం ఇదే తొలిసారి. కేంద్ర ప్రభుత్వం 2020లో ప్రవేశపెట్టిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం ఈ అద్భుతమైన ప్రగతికి ప్రధాన కారణంగా నిలుస్తోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ పథకం ద్వారా దేశంలో స్థానిక తయారీ గణనీయంగా పెరిగింది. 2021 ఆర్థిక సంవత్సరంలో కేవలం 3.1 బిలియన్ డాలర్లుగా ఉన్న స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు, 2025 నాటికి 24.1 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇందులో 17.5 బిలియన్ డాలర్లు ఒక్క యాపిల్ వాటానే ఉంది. మొత్తంగా ఎలక్ట్రానిక్స్ రంగం కూడా పరుగులు పెడుతోంది. ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో దేశం నుంచి 12.4 బిలియన్ డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్స్ వస్తువులు ఎగుమతి కాగా, ఇందులో స్మార్ట్‌ఫోన్ల వాటా 62 శాతానికి పెరిగింది. ఇది కేవలం అసెంబ్లింగ్ నుంచి విలువ ఆధారిత తయారీ వైపు భారత్ పయనిస్తోందనడానికి నిదర్శనమని నివేదికలు చెబుతున్నాయి. యాపిల్ తర్వాత శాంసంగ్ 12 శాతం వాటాతో రెండో స్థానంలో ఉండగా, డిక్సన్ టెక్నాలజీస్ అనుబంధ సంస్థ ప్యాడ్జెట్ ఎలక్ట్రానిక్స్ 175 మిలియన్ డాలర్ల విలువైన ఫోన్లను ఎగుమతి చేసింది. ఒకప్పుడు ఎగుమతుల జాబితాలో 167వ స్థానంలో ఉన్న స్మార్ట్‌ఫోన్లు, ఇప్పుడు దేశం నుంచి ఎగుమతి అయ్యే వస్తువుల్లో అగ్రస్థానానికి చేరి ప్రపంచ ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా భారత్ స్థానాన్ని సుస్థిరం చేశాయి.

## ఏఐతో కొన్ని ఉద్యోగాలకు ముప్పు తప్పదు

కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో, దాని ప్రభావంపై మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఆసక్తికరమైన విశ్లేషణ చేశారు. ఏఐ రాకతో పారాలీగల్స్, ఎంట్రీ–లెవల్ అకౌంటెంట్ల వంటి కొన్ని ఉద్యోగాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆయన అంగీకరించారు. అయితే, ఇదే సమయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఏఐ ఒక గొప్ప వరంగా మారుతుందని, అనేక రంగాల్లో ఉత్పాదకతను పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఏఐ సామర్థ్యాలపై మాట్లాడుతూ, టెలిసేల్స్, టెలి సపోర్ట్ వంటి పనులతో పాటు సాధారణ కోడింగ్ టాస్క్‌లను కూడా ఏఐ సమర్థవంతంగా నిర్వహించగలదని బిల్ గేట్స్ పేర్కొన్నారు. అయితే, అత్యంత సంక్లిష్టమైన కోడింగ్ సవాళ్లను ఎదుర్కొనే స్థాయికి ఏఐ ఇంకా చేరుకోలేదని స్పష్టం చేశారు. ఈ స్థాయికి చేరడానికి ఒకట్రెండు సంవత్సరాలు పడుతుందా లేక దశాబ్ద కాలం పడుతుందా అనే దానిపై నిపుణుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయని ఆయన వివరించారు. ఏఐ పరిశోధనలో కనిపిస్తున్న వేగవంతమైన పురోగతి తనను ఆశ్చర్యపరిచిందని గేట్స్ తెలిపారు. ముఖ్యంగా అల్ప ఆదాయ దేశాలలో విద్య, వైద్యం, వ్యవసాయం వంటి కీలక రంగాల్లో ఉత్పాదకతను పెంచడానికి ఏఐకి అపారమైన అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సరైన పద్ధతిలో వినియోగిస్తే, ఏఐ మానవాళి అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. గతంలో పరిశ్రమల్లోకి రొబోటిక్ ఆర్మ్స్ వచ్చినప్పుడు బ్లూ–కాలర్ ఉద్యోగాలపై ఎలా ప్రభావం పడిందో, ఇప్పుడు ఏఐ రాకతో వైట్–కాలర్ ఉద్యోగాలపై అలాంటి ప్రభావమే ఉంటుందని ఆయన పోల్చారు. ఈ మార్పులకు అనుగుణంగా ప్రపంచం సర్దుబాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

## ఏటీఎంలలో రూ. 500 నోట్లు బంద్?

ఏటీఎంల ద్వారా 500 రూపాయల నోట్ల జారీని నిలిపివేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆదేశాలు జారీ చేసిందంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమవుతున్న సందేశం పూర్తిగా అవాస్తవమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆర్‌బీఐ అలాంటి ఆదేశాలేవీ ఇవ్వలేదని, ప్రజలు ఇలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని హెచ్చరించింది.

**వైరల్ మెసేజ్‌లో ఏముంది?**

2025 సెప్టెంబర్ 30 నాటికి ఏటీఎంల నుంచి రూ. 500 నోట్ల జారీని నిలిపివేయాలని ఆర్‌బీఐ బ్యాంకులను ఆదేశించిందని ఓ సందేశం వాట్సాప్‌లో చక్కర్లు కొడుతోంది. 2026 మార్చి 31 నాటికి 90 శాతం, సెప్టెంబర్ 30 నాటికి 75 శాతం ఏటీఎంలలో ఈ నోట్ల పంపిణీ ఆగిపోతుందని ఆ సందేశంలో పేర్కొన్నారు. ప్రజలు తమ వద్ద ఉన్న రూ. 500 నోట్లను మార్చుకోవాలని, భవిష్యత్తులో ఏటీఎంలలో కేవలం రూ. 100, రూ. 200 నోట్లు మాత్రమే అందుబాటులో ఉంటాయని కూడా అందులో ఉంది.

**ప్రభుత్వం ఏం చెప్పింది?**

ఈ వైరల్ సందేశంపై ప్రభుత్వ అధికారిక మీడియా సంస్థ అయిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పందించింది. ఆర్‌బీఐ అలాంటి సూచనలేవీ చేయలేదని, రూ. 500 నోట్లు చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. "సెప్టెంబర్ 2025 నాటికి ఏటీఎంల నుంచి రూ. 500 నోట్ల పంపిణీని నిలిపివేయాలని ఆర్‌బీఐ బ్యాంకులను కోరిందా? ఈ మేరకు వాట్సాప్‌లో వ్యాపిస్తున్న సందేశం పూర్తిగా అవాస్తవం. ఆర్‌బీఐ నుంచి అలాంటి ఆదేశాలు జారీ కాలేదు. రూ. 500 నోట్లు చెల్లుబాటులోనే కొనసాగుతాయి" అని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ తన పోస్టులో పేర్కొంది. గత నెలలో కూడా ఇలాంటి వదంతే సోషల్ మీడియాలో వైరల్ అయిందని, అప్పుడు కూడా దానిని ఖండించామని అధికారులు గుర్తుచేశారు. కరెన్సీకి సంబంధించిన ఏ సమాచారాన్నైనా నమ్మే ముందు ఆర్‌బీఐ లేదా పీఐబీ వంటి అధికారిక వర్గాల ద్వారా నిర్ధారించుకోవాలని, ఇలాంటి మోసపూరిత సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

# ఎన్నికల ఎఫెక్ట్..
# 'తమిళనాట 6.5 లక్షల కొత్త ఓటర్లు'

**ఢిల్లీ:** ఓటర్ లిస్టు విషయంలో ఎన్నికల సంఘంపై ఇప్పటికే ప్రతిపక్ష పార్టీ నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న వేళ కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం మరో బాంబు పేల్చారు. తమిళనాడులో ఏకంగా 6.5 లక్షల మంది ఓటర్లు పెరిగారని చెప్పుకొచ్చారు. దీంతో ఓటర్ లిస్ట్‌పై కొత్త చర్చ మొదలైంది. బీహార్‌లో ఎన్నికల సంఘం నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమిళనాడులో కూడా ఓటర్ల సంఖ్య పెరిగిందని కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం తెలిపారు. తాజాగా చిదంబరం ట్విట్టర్ వేదికగా.. 'ఎస్ఐఆర్ ప్రక్రియ మరింత ఆసక్తికరంగా మారుతోంది. బీహార్‌లో 65 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదంలో ఉండగా.. తమిళనాడులో మాత్రం 6.5 లక్షల మంది ఓటర్లు పెరిగారు. ఇది ఆందోళనకరమైన చర్య. చట్టవిరుద్ధమైనది. పెరిగిన ఓటర్లను శాశ్వత వలస కార్మికులు అని పిలిస్తే అసలైన వలస కార్మికులను అవమానించినట్లు



అవుతుంది. తమిళనాడు ఓటర్లు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం లేకుండా చేసేందుకు ఓట్ల పెంపుదల జరిగింది. ఎన్నికల సంఘం తన అధికారాలను దుర్వినియోగం చేస్తోంది. రాష్ట్రాల ఎన్నికల విధానాలను మార్చేందుకు ఈసీ ప్రయత్నిస్తోంది. ఈ అధికార దుర్వినియోగాన్ని రాజకీయంగా, చట్టబద్ధంగా ఎదుర్కోవాల్సిందే' అని పిలుపునిచ్చారు. ప్రతి భారతీయుడికి శాశ్వత నివాసం ఉన్న ఏ రాష్ట్రంలోనైనా నివసించడానికి, పని చేయడానికి హక్కు ఉంది. అది స్పష్టంగా సరైనది. బీహార్ ప్రస్తుత ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్న లక్షల మంది వ్యక్తులు రాష్ట్రం నుండి శాశ్వతంగా వలస వెళ్లారు. కాబట్టి వారిని మినహాయించాలని ఎన్నికల సంఘం ఎలా నిర్ణయానికి వచ్చింది?. ఒక వ్యక్తి ఒక రాష్ట్రం నుండి శాశ్వతంగా వలస వెళ్లారు అని నిర్ధారణకు రాక ముందే, ప్రతి కేసుపై సమగ్ర విచారణ నిర్వహించకూడదా?. సామూహిక ఓటుహక్కుల తొలగింపు అనేది తీవ్రమైన సమస్య, అందుకే సుప్రీంకోర్టు పిటిషన్లను విచారిస్తోంది' అంటూ చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే చిదంబరం తన పోస్టుకు తమిళనాడు ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ట్యాగ్ చేశారు. తమిళనాడు ఓటరు జాబితాలో వలస కార్మికులను చేర్చడంపై అధికార డీఎంకేతో పాటు ప్రాంతీయ పార్టీలు కూడా ఆందోళన వ్యక్తం చేశాయి.

# దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు కేంద్రం గుడ్‌న్యూస్..
# 35 రకాల మందుల ధరలు తగ్గిస్తూ నిర్ణయం..!

దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి కేంద్రం భారీ ఊరట కల్పించింది. దేశవ్యాప్తంగా 35 రకాల మందుల ధరలను తగ్గించింది. దేశ ప్రజలకు ప్రజలకు మందులను మరింత అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో, జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ ప్రముఖ ఫార్మాస్యూటికల్ కంపెనీలు విక్రయిస్తున్న 35 ఔషధాల రిటైల్ ధరలను తగ్గించింది. ఈ ఒంటినొప్పులు, గుండెసంబంధిత, మధుమేహం, మానసిక వ్యాధుల చికిత్సకు ఉపయోగించే ఔషధాలపై తగ్గింపు వర్తించనున్నది. దాంతో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఊరట కలుగనున్నది. ఈ మేరకు రసాయనాలు–ఎరువుల మంత్రిత్వ శాఖ ఈ ఉత్తర్వులను మేరకు జారీ చేసింది. యేసిలోఫెనాక్, పారాసెటమాల్, ట్రైప్సిన్ కైమోట్రిప్సిన్ ఫిక్స్‌డ్–డోస్ కాంబినేషన్, అమోక్సిసిలిన్–పొటాషియం క్లావ్యులానేట్, అటోర్వాస్టాటిన్, ఎంపాగ్లిఫ్లోజిన్, సిటాగ్లిప్టిన్, మెట్‌ఫార్మిన్ వంటి మందులున్నాయి. డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ విక్రయించే యేసిలోఫెనాక్–పారాసెటమాల్–ట్రైప్సిన్ కైమోట్రిప్సిన్ మాత్ర ధరను



రూ.13గా నిర్ణయించింది. క్యాడిలా ఫార్మాస్యూటికల్స్ విక్రయించే అదే ఫార్ములేషన్ ధరను 15.01గా పేర్కొంది. గుండె సంబంధిత వ్యాధులున్న వారు విస్తృతంగా వాడే మెడిసిన్ అయిన అటోర్వాస్టాటిన్ 40 %ఎస్త్ర% ం క్లోపిడొగ్రెల్ 75 %ఎస్త్ర% మాత్రల ధరలను రూ.25.61గా నిర్ణయించింది. చిన్నపిల్లలకు ఉపయోగించే సెఫిక్సిమ్, పారాసెటమాల్ ఓరల్ సస్పెన్షన్స్, విటామిన్ డీ లోపం ఉన్న వారిలో వాడే కోలికాల్సిఫెరాల్ డ్రాప్స్, డైక్లోఫెనాక్ ఇంజెక్షన్ ధర రూ.31.77కి తగ్గించింది. రిటైలర్లు, డీలర్లు అందరూ మెడికల్ షాపుల్లో తాజా ధరల జాబితాను స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించింది. ఎక్కువకు ధరకు ఆయా మందులను విక్రయిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఔషధ ధరల నియంత్రణ ఆర్డినెన్స్ 2013, ఎసెన్షియల్ కమెడిటీస్ యాక్ట్ 1955 ప్రకారం జరిమానాలు విధించనున్నట్లు తెలిపింది. ఆయా మెడిసిన్ల ధరలు మినహాయించామని.. అదనంగా జీఎస్టీని చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. ఔషధ తయారీ కంపెనీలు కొత్త ధరల జాబితాను ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యూటికల్ డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో అప్‌డేట్ చేసి.. ఎన్‌పీపీఏ, రాష్ట్రాల డ్రగ్ కంట్రోలర్స్‌కు సమర్పించాలని ఆదేశించింది. తాజా ఆదేశాలతో ఆయా ఔషధాలపై ఇప్పటికే ఉన్న ధరల ఉత్తర్వులు రద్దయినట్లు స్పష్టం చేసింది.

# అసహజ మరణాల రికార్డులు డిలీట్
# ధర్మస్థలలో మరో షాకింగ్ విషయం

**ఇంటర్నెట్ డెస్క్:** ధర్మస్థలలో దాదాపు 15 ఏళ్లలో చోటుచేసుకొన్న అసహజ మరణాల రికార్డులు మాయం అయ్యాయి. ఈ విషయాన్ని సమాచార హక్కు చట్టం కార్యకర్త ఒకరు వెలుగులోకి తీసుకొచ్చారు. తాను వందకు పైగా యువతులు, మహిళల మృతదేహాలను పూడ్చానని ఓ పారిశుద్ధ్య కార్మికుడి ప్రకటన సంచలనం సృష్టిస్తున్న వేళ ఈ విషయం బయటకు రావడం గమనార్హం. బెళ్తంగడి పోలీసులు 2000–2015 మధ్య అసహజ మరణాల రికార్డును ఓ పద్ధతి ప్రకారం తొలగించినట్లు ఆర్టీఐ కింద చేసిన దరఖాస్తులో వెల్లడైంది. ఈ మేరకు అన్ నేచురల్ డెత్ రిజిస్టర్‌లో ఆ వివరాలు ఉన్నాయని ఓ ఆంగ్లపత్రిక కథనంలో పేర్కొంది. ఇదే సమయంలో పెద్ద సంఖ్యలో అనుమానాస్పద, లెక్కలోకి రాని మరణాలు చోటు చేసుకొన్నట్లు ఆరోపణలున్నాయి. తాజాగా ఆర్టీఐ కార్యకర్త జయంత్ సిట్ వద్ద ఫిర్యాదు చేశారు. ఓ యువతి మృతదేహాన్ని అక్రమంగా పాతిపెట్టడం తాను చూశానని.. అధికారులు కూడా అక్కడే ఉన్నారని దానిలో



పేర్కొన్నారు. దీంతో సిట్ ఫిర్యాదు నమోదు చేసి.. ఆ మృతదేహాన్ని వెలికి తీయాల్సి ఉంది. పోలీసుల పనితీరు తెలుసుకోవడానికి జయంత్ చాలా కాలం నుంచి ఆర్టీఐని వాడుకొంటున్నారు. ఆచూకీ గల్లంతైన వ్యక్తులు, వారి ఫొటోలను తాను చాలా కాలం క్రితమే బెళ్తంగడి పోలీసులను అడిగినట్లు చెప్పారు. కానీ, తమ వద్ద ఉన్న పత్రాలు, పోస్టుమార్టం రిపోర్టులు, వాల్‌పోస్టర్లు, నోటీసులు, ఫొటోగ్రాఫ్‌లు సాధారణ పరిపాలన పరమైన ఆదేశాల మేరకు నాశనం చేసినట్లు వారు చెప్పారన్నారు. దీంతో ఆగస్టు 2వ తేదీన సిట్ వద్ద ఫిర్యాదు నమోదు చేసినట్లు చెప్పారు. గతంలో ఓ యువతి మృతదేహం పోలీసులకు లభించగా.. దానిని నిబంధనలు ఉల్లంఘించి ఘోరంగా పాతిపెట్టారన్నారు. ఇప్పుడు మృతదేహ అవశేషాలు దొరికినా.. వాటిని ఎవరితో పోలుస్తారని ప్రశ్నించారు. ధర్మస్థలలో తాను వందకు పైగా యువతులు, మహిళల మృతదేహాలను ఖననం చేశానని ప్రకటించిన ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు చూపించిన తొమ్మిది, పదో పాయింట్లలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తవ్వకాలు కొనసాగాయి. తొమ్మిదో ప్రాంతంలోనే తాను ఏడు మృతదేహాలను ఖననం చేశానని చెప్పడంతో కార్మికుల సాయంతో మధ్యాహ్నం వరకు మెల్లగా తవ్వకాలు చేయించారు. అక్కడ ఏమీ కనిపించకపోవడంతో మినీ బుల్డోజర్‌తో పనులు చేయించారు. అక్కడా ఏమీ లభించకపోవడంతో, పదో ప్రాంతానికి వెళ్లి తవ్వకాలు కొనసాగించారు.

# 'రెండు రూపాయల డాక్టర్' ఇకలేరు

**తిరువనంతపురం:** పేదల జీవితాల్లో వెలుగులు నింపిన నిస్వార్థ సేవకుడు. డాక్టర్ ఏకే రైరూ గోపాల్ అలియాస్ 'రెండు రూపాయల డాక్టర్' ఆదివారం (ఆగస్టు 3న) కన్నుమూశారు. ఉత్తర కేరళలోని కన్నూర్‌లో వేలాది మంది జీవితాల్లో నిస్వార్థ సేవ చేసిన డాక్టర్ గోపాల్ పేదలు,అణగారిన ప్రజలకు దశాబ్దాలుగా(ఒక దశాబ్దం అంటే 10ఏళ్లు) రెండు రూపాయిలకే వైద్యం అందించారు. డాక్టర్ ఏకే రైరూ గోపాల్ 50 ఏళ్ల పాటు అతి తక్కువకే రూ.2కే వైద్యం చేసేవారు. అందుకే ఆయనను అందరూ 'రెండు రూపాయల డాక్టర్..రెండు రూపాయల డాక్టర్' అని పిలుస్తుంటారు. ఇతర డాక్టర్లు ఒక్క ఓపీకి వందల్లో ఛార్జ్ చేస్తుంటే డాక్టర్ గోపాల్ మాత్రం పేషెంట్ స్థోమతను బట్టి రూ.40, రూ.50 మాత్రమే తీసుకునేవారు. అలా వైద్యం ఖరీదైన తరుణంలో డాక్టర్ గోపాల్ మాత్రం వైద్యంలో దాతృత్వం, నీతికి చిహ్నంగా నిలిచారు. వైద్యుడిగా సేవలందిస్తుండగా.. ఓ రోగి దారుణమైన పరిస్థితిని చూసి చలించిపోయారు. అలా ఆయన ప్రయాణం స్వచ్ఛంద సేవతో ప్రారంభమైంది. నాటి నుంచి ముఖ్యంగా రోజూవారి దినసరి కూలీలు, విద్యార్థులకు, పేదలకు అందుబాటులో సరసమైన వైద్యాన్ని అందించేందుకు తనని తాను అంకితం చేసుకున్నారు. విధులు నిర్వహించే సమయంలో తన మిత్రులు, కుటుంబ సభ్యులు,ఇంకెవరైనా తనని కలిసేందుకు వస్తే రోగులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు.. తన ఇంటి గేటుకు ఓ బోర్డు తగిలలించారు. ఆ బోర్డులో రోగులకు చికిత్స చేసే సమయంలో తనకోసం ఎవరూ రావొచద్దు. ఒక వేళ రావాలని ప్రయత్నం చేస్తారేమో.. రావద్దు. చిరునవ్వుతో తిరిగి వెనక్కి వెళ్లిపోండి అని రాసి ఉంచారు. అంతలా తన వైద్య సేవల్ని అందించడంలో నిమగ్నమయ్యేవారు.

### ఆయన ఎందుకంత ప్రత్యేకం

50 సంవత్సరాలకు పైగా వైద్య రంగంలో సేవ చేసిన ఆయన రూ.2 రూపాయలకే వైద్యం పొందేలా అవకాశం కల్పించారు. దినసరి కూలీలను దృష్టిలో ఉంచుకొని ప్రతి రోజూ అర్ధరాత్రి 2:15 నుండే రోగుల కోసం వైద్య సేవలు ప్రారంభించి.. ఇలా ప్రతి రోజు 300–400 మంది వరకు రోగులకు చికిత్స అందించేవారు. తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండే మందులే సూచించేవారు. గోపాల్‌కు తోడుగా ఆయన సతీమణి డాక్టర్ శకుంతల, సహాయకులు మందులు పంపిణీ చేయడంలో సహాయపడేవారు.

### డాక్టర్ గోపాల్ చేసిన సేవలకు గాను

డాక్టర్ గోపాల్ చేసిన సేవలకు గాను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నుండి కేరళలో ఉత్తమ ఫ్యామిలీ డాక్టర్ అవార్డు పొందారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆయన



సేవలను ప్రశంసిస్తూ "ప్రజల డాక్టర్" అని అభివర్ణించారు. ఆయన దగ్గరకు వెళ్లడం అంటే మందు (మెడిసిన్) కోసం కాదు, ప్రేమ కోసం అని స్థానికులు చెబుతుండగా..'ఆయనను కలిస్తే ఎలాంటి అనారోగ్య సమస్య అయినా ఇట్టే తగ్గిపోతుందనేది రోగుల నమ్మకం. డాక్టర్ గోపాల్ తదనంతరంతో ఆయన సోదరులు డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ రాజగోపాల్‌లు వైద్య సేవల్ని కొనసాగించనున్నారు.

## నితిన్ గడ్కరీ ఇంటికి బాంబు బెదిరింపు..



**నాగపూర్:** ఇటీవలి కాలంలో బాంబు బెదిరింపు కాల్స్, మెయిల్స్ రావడం తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ నివాసానికి బాంబు బెదిరింపు రావడం సంచలనంగా మారింది. దీంతో, రంగంలోకి దిగిన పోలీసులు.. గాలింపు చర్యలు చేపట్టారు. వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఉన్న నితిన్ గడ్కరీ నివాసంలో బాంబు పెట్టినట్లు ఓ వ్యక్తి.. పోలీసులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో, అప్రమత్తమైన పోలీసులు, బాంబ్‌స్క్వాడ్.. గడ్కరీ ఇంట్లో గాలింపు చర్యలు చేపట్టారు. సోదాల తర్వాత ఎటువంటి పేలుడు పదార్థాలు దొరకకపోవడంతో అది నకిలీ బెదిరింపు అని తేల్చారు. అనంతరం ఫోన్ నంబర్ ఆధారంగా గంటల వ్యవధిలోనే పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. నకిలీ బెదిరింపు కాల్ చేసిన వ్యక్తిని నాగ్‌పుర్ తులసి బాగ్ రోడ్‌లోని మద్యం దుకాణంలో పనిచేసే ఉమేష్ విష్ణు రౌత్‌గా గుర్తించామన్నారు. బెదిరింపు కాల్ చేయడానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

## ఆయనకు ఏమైనా కారణాలుండొచ్చు



**ఢిల్లీ:** ఓ వైపు భారత్‌ను మిత్రదేశం అంటూనే మన ఆర్థిక వ్యవస్థను ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. రష్యా, భారత్..వాటి డెడ్ ఎకానమీ (నిర్వీర్యమైన ఆర్థిక వ్యవస్థ)లను మరింత దిగజార్చుకోనీయండంటూ వ్యాఖ్యానించారు. వీటిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలను రాహుల్ సమర్థించడంపై ఆ పార్టీ ఎంపీ శశిథరూర్ స్పందిస్తూ..కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ వ్యాఖ్యలకు మద్దతివ్వడానికి రాహుల్‌కు మరేమైనా కారణాలు ఉండొచ్చన్నారు. అయితే, రాహుల్ అభిప్రాయంపై తాను ఎటువంటి వ్యాఖ్యలు చేయదలుచుకోలేదన్నారు. భారత్– అమెరికా సంబంధాలపై థరూర్ మాట్లాడుతూ.. వ్యూహాత్మక, ఆర్థిక భాగస్వామిగా వాషింగ్టన్ న్యూఢిల్లీకి చాలా ముఖ్యమైందన్నారు. ఎందుకంటే భారత్ నుంచి అమెరికాకు దాదాపు 90 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులు ఎగుమతి అవుతున్నాయన్నారు. ఇరుదేశాల మధ్య సముచిత వాణిజ్య ఒప్పందం కుదిరేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా ఇటీవల థరూర్‌కు కాంగ్రెస్ పార్టీకి మధ్య అభిప్రాయభేదాలు తెరపైకి వస్తున్నాయి. ఆయన వ్యవహార శైలిపై సొంత పార్టీలో అసంతృప్తి పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో రాహుల్‌పై థరూర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తుందనే కారణం చూపుతూ.. భారత నుంచి దిగుమతులపై ట్రంప్ 25శాతం సుంకాలతో పాటు పెనాల్టీలు విధించారు. ఈ క్రమంలోనే రష్యాతో భారత్ ఎలాంటి వాణిజ్యం చేసుకున్నా తనకు సంబంధం లేదన్నారు. ఇరు దేశాలు ఆర్థికవ్యవస్థలను మరింత పతనం చేసుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ ఆయన వ్యాఖ్యలను సమర్థించారు. దీనిపై భారత ప్రధాని మోదీ ఘాటుగా స్పందించారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదిగే దిశగా భారత్ పరుగులు పెడుతోందన్నారు. అంతేకాదు.. ట్రంప్ టారిఫ్‌ల వేళ స్వదేశీ ఉత్పత్తులను పెంచాలంటూ పిలుపునిచ్చారు.

## మూడో రోజుకు చేరిన ఆపరేషన్ అఖల్

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో ఉగ్రవాదుల అంతుచూసేందుకునే భద్రతా దళాలు చేపట్టిన ఆపరేషన్ అఖల్ మూడో రోజుకు చేరింది. ఈ ఆపరేషన్‌లో ఇప్పటివరకు ఆరుగురు ముష్కరులు హతమయ్యారు. ఓ జవాన్ గాయపడ్డారు. ఆపరేషన్ అఖల్ శుక్రవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. కుల్గాం జిల్లాలోని అఖల్ అటవీ ప్రాంతంలో టెర్రరిస్టులు ఉన్నారన్న సమాచారంతో భద్రతా బలగాలు, స్థానిక పోలీసులు ఆగస్టు 1న గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఉగ్రవాదులు, భద్రతా దళాలకు మధ్య శనివారం రోజంతా కాల్పులు కొనసాగాయాయి. ఈ సందర్భంగా ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. మరోవైపు ముష్కరుల కాల్పుల్లో సీఆర్‌పీఎఫ్ జవాన్ గాయపడ్డారు. మృతులు ఉగ్రవాదులు నిషేధిత లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్‌కు చెందినవారని అధికారులు తెలిపారు. పహల్గామ్ ఉగ్రదాడికి టీఆర్ఎఫ్ బాధ్యత వహించిన విషయం తెలిసిందే. ఉగ్రవాదుల కాల్పుల్లో 26 మంది పర్యాటకులు మరణించారు.



## మాలేగావ్ పేలుళ్లు కాంగ్రెస్ కుట్ర
## మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్

**ఇంటర్నెట్‌డెస్క్:** మాలేగావ్ పేలుడు కేసులో నిర్దోషిగా విడుదలైన భాజపా మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ ఆదివారం భోపాల్ చేరుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 2008 మాలేగావ్ పేలుళ్లు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కుట్రగా అభివర్ణించారు. పార్టీ ఓటు బ్యాంకును సంతృప్తి పరచడానికి, ఈ కేసులో భాజపాను ఇరికించడానికి కాంగ్రెస్ పార్టీ తీవ్ర ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. ఈ కేసును దేశద్రోహం కింద విచారించాలని డిమాండ్ చేశారు. ఆనాటి పేలుళ్లకు భాజపాను కారణంగా చూపాలని ప్రయత్నాలు చేసిన వారికి కోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిదని అన్నారు. కాంగ్రెస్‌వి మతతత్వ రాజకీయాలని.. ఆ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసుల్లో ఇరికించి.. జైళ్లలో హింసించేవారని ఆరోపించారు. మాలేగావ్ పేలుడు కేసులో నిర్దోషిగా విడుదలైన అనంతరం శనివారం ప్రజ్ఞా ఠాకూర్ మాట్లాడుతూ.. కేసు విచారణ సమయంలో దర్యాప్తు అధికారులు వ్యవహరించిన తీరుపై విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ప్రధాని మోదీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పేర్లు చెప్పాలని తనపై ఒత్తిడి తెచ్చారని ఆమె ఆరోపించారు. అయితే అవన్నీ అబద్ధాలు కావడంతో తాను ఏమీ చెప్పలేదన్నారు.

# రేవంత్ పాలనలో ఆర్థిక వ్యవస్థ ఆగమాగం

**నమ్మి ఓట్లేసిన ప్రజలని నిండా ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం.**

**మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్.**



ఈరోజు గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన పలువురికి ఇటీవల అనారోగ్యంతో బారిన పడిన వారికి హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం వారు మాజీ మంత్రి హరీష్ రావు సహకారంతో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి చొరవతో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఆర్థిక సహాయం కింద ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన చెక్కులను డబ్బేట రాములు 18000 ,చాకలి గీతా 14500, బోయిని లావణ్య 10500, బోయిని కవిత 15000, బురుజుకింది రాజిరెడ్డి 15000, కుంట నర్సారెడ్డి 15000, చాడ గోపు సంధ్య 14500. వీరికి సుమారు 102500 విలువ గల చెక్కులని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అందచేయడం జరిగింది. సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందని ఆరు గ్యారెంటీల మోసపూరిత హామీలు కుమ్మరించి అసమర్థ పాలనతో ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీశారని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదు అని ఆయన తెలిపారు.ప్రజలు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కోపంగా ఉన్నారు అని ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.సంక్షేమంలో స్వర్ణయుగంలాగా కేసీఆర్ పాలన సాగింది అని ఆయన గుర్తు చేశారు.ఏ కారణం చేత రైతు చనిపోయినా ఆ కుటుంబం రోడ్డున పడొద్దని ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 5 లక్షల రూపాయలతో రైతుబీమాను అమలు చేశారు అని ఆయన అన్నారు .200 వృద్ధాప్య పింఛన్ ను 2 వేలకు, 500 వికలాంగుల పెన్షన్ ను 3000 కు పెంచారన్నారు.తెలంగాణ ఏర్పడే నాటికి వరి ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే దిగువ ఉన్న తెలంగాణను పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రలని వెనక్కి నెట్టి దేశంలోనే నంబర్ వన్ గా నిలబెట్టిన నాయకుడు కేసీఆర్ అని గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలను మార్చిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని అన్నారు.ఒక్క వ్యవసాయంలోనే కాకుండా అన్ని రంగాల్లో ముందుచూపుతో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేశారన్నారు. తెలంగాణలో కేవలం ఐదు మెడికల్ కాలేజీలు ఉంటే కేసీఆర్ గారు 33 మెడికల్ కాలేజీలను ప్రారంభించారని వైద్యరంగంలో విప్లవాత్మక మార్పుల కోసం శ్రీకారం చుట్టారన్నారు. గురుకుల పాఠశాలను సంఖ్యను పెంచారని అన్నారు.ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా కేసీఆర్ గారు తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో అన్ని రంగాల్లో సమగ్ర, సమతుల్య, సమీకృత, సమ్మిళిత అభివృద్ధిని సాధించారని ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం తెలంగాణలో నిర్మించి సాగు ,త్రాగు నీటి సమస్యను తీర్చారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును బద్నామ్ చేశాక నోటికి వచ్చిన వాగ్దానాలు చేసి ప్రజలను మభ్యపెట్టారని గుర్తు చేశారు.మొదటి సంవత్సరమే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ రెచ్చగొట్టారని ఈరోజు నోటిఫికేషన్లు ఇవ్వమని నిరుద్యోగులు రోడ్ల మీదకి వచ్చి ధర్నాలు చేసిన ఉలుకు లేకుండా చోద్యం చూస్తున్నారని అన్నారు. కేసీఆర్ ఇచ్చిన దానికంటే ఎక్కువ ఇస్తామని ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించారుని మోసం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత హామిలు అన్ని అటకెక్కించరని తెలిపారు కుట్ర పూరితంగా తెలంగాణ ప్రజల మనసులో ఖరాబ్ చేశారు అని అన్నారు..ప్రజాస్వామ్యంలో రాజకీయ నాయకుడైన అధికారులైనా ప్రజా తీర్పుకు భయపడతారు, అందుకే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులను గెలిపించుకోవాలన కోరారు.గోదావరి నీళ్లను ఎత్తుకుపోయే కుట్రలను ప్రజలకు వివరిస్తూనే బీఆర్ఎస్ మీద జరుగుతున్న దాడిని ఎండగట్టుధం అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పోరాటం చేద్దాం అని అన్నారు. ఎప్పటికైనా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కాపాడేది బీఆర్ఎస్ పార్టీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ చాడ శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ , మాజీ కో అప్షన్ అహ్మద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నిజామోద్దీన్,కుంట కిష్టారెడ్డి, సత్యన్నారాయణ గౌడ్, కర్నాకర్ రెడ్డి, బుచ్చిరెడ్డి,మంద నరేష్, నాంపల్లి, మధు, మోహన్ రెడ్డి, లింగం, లబ్ధిదారుల కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు.

# ప్యారా టైక్వాండో పోటీలో బ్రాంజ్ (కాస్యం, తృతీయ స్థానం)పథకం సాధించిన మాచర్ల కృష్ణవేణికి అభినందనలు

## తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిది గోపి

**జనగామ,ఆగస్టు 03 సామాన్యుడి అస్త్రం దిన పత్రిక**






జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలం విశ్వనాథ గూడెం చెందిన మాచర్ల కృష్ణవేణిని మట్టిలో మాణిక్యం అన్న పదానికి అర్థమై నిలిచిందని తెలంగాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిది గోపి అన్నారు జూలై 30,31 తేదీలలో మలేషియా దేశ రాజధాని కూచింగ్ పట్టణంలో ఏషియన్ ప్యారా తైక్వాండో జరిగిన పోటీలలో కృష్ణవేణి భారతదేశం తరఫున పాల్గొని బ్రాంచ్ మెడల్ (కాస్య పథకం,తృతీయ స్థానం)సాధించడం భారతదేశానికి తెలంగాణ రాష్ట్రానికి జనగామ జిల్లాకు ఎంతో గర్వకారణం అని వారు అన్నారు.ఈసందర్భంగా ఆమెను తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం తరఫున అభినందిస్తున్నామని తెలిపారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మలేషియాలో ఆసియా ఖండంలోని 48 దేశాల నుంచి ప్యారా తైక్వాండో పోటీలలో సీనియర్స్ అండ్ జూనియర్స్ పాల్గొన్నారు.మన భారతదేశం నుండి సీనియర్ మరియు జూనియర్ విభాగంలో 200 మందికి పైగా పాల్గొన్నారు.పుంసే సీనియర్ విభాగం నుండి కృష్ణవేణి నాలుగు రౌండ్స్ లో తలబడి ఇరాక్ దేశ క్రీడాకారుని పై కృష్ణవేణి మెడల్ సాధించిందని వివరించారు పువ్వు పుట్టగానే పరిమళించును అన్నట్లు కృష్ణవేణి చిన్నప్పటినుండి చదువులలో కనబరిచిన ప్రతిభను క్రీడల పట్ల తనకున్న ఆసక్తిని గమనించిన ఉపాధ్యాయులు కళాశాల లెక్చరర్స్ ప్రోత్సాహం అలాగే తనను అభిమానించే దాతల సహకారంతో జిల్లా స్థాయిలో రాష్ట్రస్థాయిలో దేశ స్థాయిలో అనేక పథకాలు సాధించింది. ఇప్పుడు మలేషియాలో జరిగిన పోటీలలో పాల్గొనడానికి తనకు సహకారం అందించినటువంటి కౌండిన్య నార్త్ అమెరికా అసోసియేషన( కానా)అలాగే కొంతమంది గౌడ మిత్రులు కల్లుగీత కార్మిక సంఘం నాయకులు కృష్ణవేణి అభిమానించే వ్యక్తుల సహకారంతో పోటీలలో పాల్గొని భారతదేశానికి బ్రాంచ్ మెడల్ (కాస్య పతకం తృతీయ స్థానం)తో తిరిగి రావడం సంతోషించదగ్గ విషయమని ఆనందాన్ని వ్యక్తం చేశారు.కృషవేణి కోచ్ ఈ. గణేష్ ని కూడా అభిందించారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంకు అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా తీసుకుపోయి.కృష్ణవేణిని ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవ వేడుకలలో హైదరాబాదులో గౌరవ సత్కారం అందించి ప్రభుత్వపరమైన సహకారం ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్నాం అన్నారు.నేడు యువత విద్యార్థులు కృష్ణవేణి ఆదర్శంగా తీసుకొని మీరు ఎంచుకున్న వివిధ రంగాలలో మంచి నైపుణ్యతను ప్రదర్శించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని పిలుపునిచ్చారు

# చిన్ననాటి నలుగురు స్నేహితుల సంబరాలు.

**జనగామ,ఆగస్టు 03 సామాన్యుడి అస్త్రం దిన పత్రిక**

జనగామ జిల్లా కేంద్రంలో ఈరోజు స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్నేహ బంధానికి ఘనత చాటేలా ప్రత్యేక వేడుకలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా శ్రీకాంత్, సుప్రీం, శంకర్, సుధాకర్ అనే నలుగురు సన్నిహిత మిత్రులు ఒకచోట చేరి స్నేహానికి అర్థవంతమైన ఆవిష్కరణగా ఈ దినాన్ని ఉల్లాసంగా జరుపుకున్నారు ఈ నలుగురు మిత్రులు తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ పరస్పరం ఫ్రెండ్షిప్ బ్యాండ్లు కట్టుకొని, మధురమైన జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం కలిసి భోజన కార్యక్రమం, ఒకరికి ఒకరు చిన్న చిన్న బహుమతుల అందజేతతో వేడుకను మరింత సన్నిహితంగా జరిపారు ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ స్నేహం అనేది జీవితానికి ఆశ్రయం. సంతోషంలో కష్టాల్లో మన వెంట ఉండే వ్యక్తులే నిజమైన మిత్రులు అని తెలిపారు. సుప్రీం, శంకర్, సుధాకర్ కూడా తమ అనుభూతులు పంచుకుంటూ ఇలాంటి స్నేహితుల దినోత్సవం ప్రతి ఏడూ గుర్తుండిపోయేలా జరుపుకుంటాం” అని అన్నారు. ఈ వేడుక స్థానిక యువతకు స్నేహానికి కొత్త భావనను అందించిందని పలువురు అభిప్రాయపడ్డారు



## మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



తెలంగాణ రాష్ట్ర కార్మిక మరియు గనుల శాఖ మరియు ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు శ్రీ వివేక్ వెంకటస్వామి గారిని మర్యాద పూర్వకంగా కలిసిన ప్రచార కార్యదర్శి మరియు గజ్వేల్ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ లు చెన్నూరు నియోజకవర్గం నుండి గజ్వేల్ నియోజక వర్గంలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం మరియు పలు ప్రభుత్వ కార్యక్రమాలకు వెళ్ళే క్రమంలో సిద్ధిపేట లోని హరిత హొటల్ లో బస చేసినటువంటి మంత్రి వర్యులను %భూజజ% ప్రచార కార్యదర్శి నాయిని యాదగిరి మరియు గజ్వేల్ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ మరియు గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షులు మద్దూరి మల్లారెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలతో కలసి గజ్వేల్ నియోజక వర్గంలోనీ పలు సమస్యలను మరియు పార్టీ బలోపేతమునకు సంబంధించిన పలు విషయాలను చర్చించడం జరిగింది, ఈ కార్యక్రమంలో %బాజ% సెల్ సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు కొమ్ము విజయ్ కుమార్, యువజన కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు మన్నే కృపానందం, ఆత్మ కమిటీ డైరెక్టర్లు శాతం స్వామి ముదిరాజ్, సయ్యద్ బాబా, ఆకారం శ్రీనివాస్, అంకిరెడ్డి పల్లి ఉప సర్పంచ్ నర్సింగరావు, సింగోజి బ్రహ్మం, నాగరాజు మరియు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

## కార్మిక కోడులు రద్దు చేయాలి

**కనీస వేతనం 26 వేల రూపాయలకు పెంచాలి**

**సిఐటియు సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య**




కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందని కార్మికులను బానిసలుగా మార్చే కార్మిక కోడులను నాలుగింటిని రద్దు చేయాలని, కనీస వేతనాలు 26 వేల రూపాయలకు పెంచాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు గజ్వేల్ కార్యాలయంలో సత్య సూర్య అల్యూమినియం ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా వచ్చిన కార్మిక కోడుల ఫలితంగా పరిశ్రమంలో కార్మిక సంఘాలు లేకుండా పోయే ప్రమాదం ఉందని అన్నారు పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వేతనాల కోడ్, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, వర్కింగ్ కండిషన్స్ కోడ్ లలో గతంలో ఉన్న 29 కార్మిక చట్టాలలో అనుకూలమైన అంశాలు తొలగించి ఈ కోడ్లను రూపొందించడం జరిగిందని అన్నారు ఈ ఎస్ఐ, పి ఎఫ్ యజమాన్యాల ఇష్టాలకు వదిలేసిందని, కార్మిక శాఖ, ఇన్స్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ అధికారుల తనిఖీల పాత్రలను తగ్గించిందని ఫెసిలిటేటర్ గా నియమించింది అని అన్నారు. యూనియన్ గుర్తింపు ఎన్నికలలో 50% ఓటింగ్ రావడం, 50 శాతం తగ్గిన అన్ని యూనియన్లతో కమిటీ ఏర్పాటు చేయడం, యజమానులతో భేరసాల రహక్కు తొలగించడం, శాశ్వత పని ప్రదేశాలలో పర్మినెంట్ కాకుండా కాంట్రాక్టు,వివిధ పథకాల రూపంలో కార్మికులను వారికి ఎలాంటి రక్షణ లేకుండా నియమించే విధంగా కోడుల రూపొందించడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బండ స్వామి, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, సురేష్ రవి రాజ్ సద్దాం సుధాకర్ రాజు ఐలయ్య తదితరులు పాల్గొన్నారు

## గజ్వేల్ కాంగ్రెస్‌లో భగ్గు మన్న వర్గ పోరు

**బండారు శ్రీకాంత్ రెడ్డీ తూంకుంట నర్సారెడ్డి రెండు వర్గాల మధ్య ఘర్షణ...**

**మంత్రి వివేక్ వెంకటస్వామి సమక్షంలోనే ఇరు వర్గాలు తోసుకున్నారు**



**సిద్దిపేట జిల్లా:**

గజ్వేల్ పట్టణం లో మంత్రి వివేక్ వెంకట స్వామి. రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం లో రస భస గా సాగింది శ్రీకాంత్ వర్గానికి చెందిన ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి స్టేజి పై కూర్చోవడం తో నర్సారెడ్డి వర్గం ఆగ్రహం వ్యక్తం చేశారు మంత్రి వివేక్ వెంకటస్వామి రేషన్ కార్డులు ఇస్తుంటే అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు గజ్వేల్‌లో వివేక్ వెంకటస్వామి రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అడ్డుకున్న మాజీ కాంగ్రెస్ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి వర్గీయులు నర్సారెడ్డిని స్టేజి మీదకి పిలవలేదని నిరసన ఏదైనా ఉంటే బయట మాట్లాడుదామని వివేక్ వెంకటస్వామి సర్ది చెప్పినా వినని నర్సారెడ్డి వర్గీయులు. కార్యక్రమాన్ని తొందరగా. ముగించుకొని వెళ్లి పోయిన మంత్రి వివేక్ వెంకటస్వామి.

## మేమెంతో మాకంత వాట ఇవ్వాల్సిందే ...

# బీసీ నినాదంతో దేశాన్ని అట్టుడికిస్తాం

### బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు

**రాజన్న సిరిసిల్ల,సామాన్యుడి అస్త్రం (ఆగస్టు 03):**

బీసీ డిమాండ్ల సాధనే లక్ష్యంగా బీసీ నినాదంతో దేశాన్ని అట్టుడికిస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు అన్నారు. తేదీ 3బి 8 బి2025 ఆదివారం రోజున సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో జిల్లా అధ్యక్షుడు వీరబోయిన మల్లేష్ యాదవ్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పర్ష హన్మాండ్లు ముందుగా ఈనెల 7న గోవాలో జరిగే ఓబిసి పదవ మహాసభ విజయవంతం చేయాలని గోడ ప్రతులు,కరపత్రాలను బీసీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు, అనంతరం పర్ష హన్మాండ్లు మాట్లాడుతూ జనాభాలో మేమెంతో అన్ని రంగాల్లో మాకు అంత వాటా ఇవ్వాల్సిందేననీ అన్నారు, ఆగస్టు 7 1990 సంవత్సరంలో మాజీ ప్రధాని వి.పి సింగ్ మొదటిసారిగా మండల కమిషన్ సిఫార్సులు అమలు చేస్తున్నట్లు ప్రకటించారని ఆ ఆగస్టు 7 రోజున మండల్ డే గా బీసీల అందరు భావిస్తున్నారని అందుకే ఆ రోజునే జాతీయ ఓబీసీ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు, బీసీలు పోరాడితే పోయేది ఏమీ లేదని బానిస సంకెళ్లు తప్ప అని అన్నారు, బీసీలనీ చెప్పుకునేందుకు గతంలో బీసీలు జంకినారనీ ఈరోజు బీసీ అని సగర్వంగా చెప్పుకునే రోజులు వచ్చాయంటే అవి బీసీ ఉద్యమాల వలన అది మేము చేసిన ఉద్యమాలు అని ఈ సందర్భంగా పర్ష హన్మాండ్లు అన్నారు, తెలంగాణ రాష్ట్రంలో మరి జాతీయస్థాయిలో ఢిల్లీలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో మడమ తిప్పకుండా పోరాటం చేస్తేనే తెలంగాణలో బీసీ కులగనన, అటు దేశంలో జాతీయ జనగణన లలో కులగనన చేపట్టాలని నిర్ణయం తీసుకున్న విషయం గుర్తు చేస్తున్నట్లు పర్ష హన్మాండ్లు అన్నారు, ఈ దేశంలో ఉత్పత్తి బీసీల అయినప్పుడు సంపద కూడా




బీసీలదే కావాలని రక్తాన్ని చెమటగా మార్చి ఈ దేశాన్ని బతికిస్తుంటే పిడికెడు శాతం లేని వాళ్ళు సర్వసంపదను, శ్రమను దోచుకుంటున్నారన్నారు, విద్యా ,ఉద్యోగ ,స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సంబంధించిన బిల్లులు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లో మూలుగుతున్నాయని వాటిని సాధించుకొని తీరుదామని ఈ సందర్భంగా పర్ష హన్మాండ్లు అన్నారు, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, కేంద్ర బడ్జెట్లో బీసీలకు జనాభా దామాష ప్రకారం నిధులు కేటాయించాలని , బీసీ రిజర్వేషన్లు పెంచాలని, చట్టసభలలో బీసీలకు 50% రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోట ఇవ్వాలని ,బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, బీసీల క్రిమిలేయర్ ఎత్తివేయాలని ఈ సందర్భంగా పర్ష హన్మాండ్లు డిమాండ్ చేస్తూ బీసీ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరించుదామని ప్రతి ఒక్క బీసీ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పర్ష హన్మాండ్లు పిలిపించారు,

ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరవేని మల్లేష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు తడక కమలాకర్, జిల్లా అధికార ప్రతినిధి బండారి బాల్ రెడ్డి, బీసీ సేన జిల్లా అధ్యక్షుడు బట్టు ప్రవీణ్, నాయకులు బోయిన శ్రీనివాస్, బచ్చు ప్రసాద్ ,దుబాలకొండయ్య, తడుక విటల్, కోడం రవీందర్, అర్చన పెల్లి శ్రీనివాస్, సామల తిరుపతి ,బూర ఆంజనేయులు, ఇల్లంతకుంట తిరుపతి, రవీందర్, కంచర్ల రాజు ,కందుకూరి రామాగౌడ్, సామల శ్రీనివాస్, రాపెల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడపడుచుల వివాహానికి జర్పుల రాధాకృష్ణ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం

### రాధాకృష్ణ ట్రస్ట్ అధినేత జర్పుల దశరథ నాయక్





**సామాన్యుడి అస్త్రం ప్రతినిధి ఆగస్టు 3 కల్వకుర్తి నియోజకవర్గం (కడ్తాల్):**

కడ్తాల్ మండలంలో వివిధ గ్రామ పంచాయతీలలో నిర్వహించిన వివాహ శుభకార్యములకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి రాధాకృష్ణ ట్రస్టు ద్వారా టక్ రాజ్ గ్రామపంచాయతీకి చెందిన వడ్త్యావత్ అనిత దేవుల దంపతుల కుమార్తె నిహారిక ఆడపరచు వివాహానికి హాజరై నవ దంపతులను ఆశీర్వదించి మేనమామ కట్నం కింద 21000(ఇరవై ఒక్క వెయ్యి) అదే విధంగా పట్టుచీర బహుమానంగా అందించారు. అలాగే కోటియా తనకు తోచిన సహాయం 10000(పదివేలు) నిహారికకు అందించాడు. అదేవిధంగా ఆదివారం కడ్తాల్ మండలంలో గానుగుమర్ల తండా గ్రామపంచాయతీలో కాను%స్త్రబ% భాయి తండాకు చెందిన నేనావత్ దేవి కిషన్ దంపతుల కుమార్తె మీనా వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి తన ట్రస్టు ద్వారా మేనమామ కట్నం కింద 21000/-(ఇరవై ఒక్క వెయ్యి) నగదు పట్టుచీర అందించారు. అదేవిధంగా ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు పేద వాళ్లకు అండగా ఉంటూ అనేక విధాలుగా ప్రజలకు అండగా ఉంటూ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మండలం లోని ప్రజలను చూసుకుంటున్నారు. అదేవిధంగా మీనా వివాహానికి తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయం అందించారు. మాజీ వాయిస్ ఎంపీపీ ఆనంద్ చేతుల మీదుగా ఐదు వేల రూపాయల నగదు అందించారు. డైరెక్టర్ సేవ్య 5000/- రూపాయలు అందించారు. మాజీ ఉపసర్పంచ్ శారద పాండు 25000 వేలు అందించారు. అలాగే శ్రీను 10,000. లక్ష్మణ్ 10000 అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హరిచంద్ర నాయక్, సులోచన సాయిలు, మాజీ ఎంపిటిసిలు ప్రియా రమేష్ మరియు మంజుల చంద్రమౌళి, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, జగన్, నాయకులు రాములు నాయక్, ధర్మ,కృష్ణయ్య, శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ, చందు, పాండు, రాజు, మహేష్, శ్రీకాంత్,, చందర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కమలం పట్టుకోనున్నవెల్లంపల్లి

**విజయవాడ**

ఏపీలోరాజకీయాలు ఆసక్తిగా మారుతున్నాయి. రోజుకో మలుపు తిరుగుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని బలహీనం చేసేందుకు కూటమి ప్రయత్నిస్తోంది. అయితే ఎట్టి పరిస్థితుల్లో 2029 ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ధీమా వ్యక్తం చేస్తోంది. ఒకవైపు మద్యం కుంభకోణానికి సంబంధించి అరెస్టులు జరుగుతున్నాయి. ఇంకోవైపు జగన్మోహన్ రెడ్డి పరామర్శల పేరిట బల ప్రదర్శనకు దిగుతున్నారు. అయితే అరెస్టు భయంతోనే జగన్మోహన్ రెడ్డి అలా చేస్తున్నారని కూటమి చెపుతోంది. అయితే ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో అయితే ఉంది. పార్టీలో ఉన్న చాలామంది సీనియర్లు సైలెంట్ అయ్యారు. అవకాశం ఉన్నవారు కూటమి పార్టీల్లో చేరారు. ఫలితాలు వచ్చిన తర్వాత చాలామంది నేతలు పార్టీకి గుడ్ బై చెప్పారు. కూటమి పార్టీల్లో చేరారు. ఇప్పుడు మరో నేత పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. భవిష్యత్తును అంచనా వేసుకుని సదరు నేత బిజెపిలోకి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.చాలామంది బిజెపి నేతలు ఈసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అయితే కేంద్రమంత్రిగా వ్యవహరించిన సుజనా చౌదరి లాంటి నేతలు.. ఈసారి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారు. కేవలం రాష్ట్ర క్యాబినెట్లో చోటు దక్కుతుందని భావించి ఎమ్మెల్యే పదవివైపు వచ్చారు. అయితే సమీకరణల దృష్ట్యా ఆయనకు అవకాశం దక్కలేదు. ఇటువంటి తరుణంలో కేంద్ర రాజకీయాల్లోకి వెళ్లిపోతే మేలన్న నిర్ణయానికి వచ్చారు. రాజ్యసభకు నామినేటెడ్ అయి కేంద్ర మంత్రివర్గంలో చేరేందుకు ఆయన ఇప్పటినుంచే ప్రయత్నాలు మొదలుపెట్టారు. అదే జరిగితే విజయవాడ పశ్చిమ నియోజకవర్గం లో బిజెపికి సరైన నాయకత్వం అవసరం. ప్రస్తుతం బిజెపి గెలిచిన 8 అసెంబ్లీ స్థానాలను ఆ పార్టీ నిలబెట్టుకోవాలని చూస్తోంది. నియోజకవర్గాల సంఖ్య పెరిగితే పొత్తులో భాగంగా మరికొన్ని సీట్లు అడిగే అవకాశం ఉంది. అయితే భవిష్యత్తు అవసరాల దృష్ట్యా కొత్త నాయకత్వాన్ని తయారు చేసుకునే పనిలో పడింది బిజెపి.అయితే గత కొంతకాలంగా విజయవాడనగరానికి చెందిన మాజీమంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ పార్టీ మారుతారని ప్రచారం నడుస్తోంది. ఆయన గతంలో బిజెపిలో పని చేశారు. ప్రస్తుత అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ కు అత్యంత సన్నిహితుడు కూడా. 2009లో ప్రజారాజ్యం పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు వెల్లంపల్లి. ఆ ఎన్నికల్లో గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టారు. అయితే 2014 ఎన్నికలకు ముందు భారతీయ జనతా పార్టీలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. 2019 ఎన్నికలకు ముందు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ పార్టీ తరపున పోటీ చేసి గెలిచారు. జగన్మోహన్ రెడ్డి మంత్రివర్గంలో.. దేవాదాయ శాఖ మంత్రిగా వ్యవహరించారు. అయితే 2024 ఎన్నికల్లో శ్రీనివాసరావును తన సొంత నియోజకవర్గాన్ని కాదని.. పక్క నియోజకవర్గానికి పంపించారు. అయినా వెల్లంపల్లి ఓడిపోవాల్సి వచ్చింది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చారు. అయితే వచ్చే ఎన్నికల్లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి సుజనా చౌదరి తప్పుకుంటారు అన్న ప్రచారం ఉంది. అదే సమయంలో పివిఎన్ మాధవ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. దీంతో భవిష్యత్తు రాజకీయాల దృష్ట్యా.. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సమీకరణల రీత్యా.. వెల్లంపల్లి శ్రీనివాస్ బిజెపిలోకి వస్తారని ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## యువత స్వయం ఉపాధితో ఎదగాలి


### మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి



**-సామాన్యుడి అస్త్రం ఆగస్టు 03 తలకొండపల్లి మండల ప్రతినిధి**

రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండల కేంద్రంలో అంతారం గ్రామ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు నాగేష్ వాళ్ళ తమ్ముడు గణేష్ తలకొండపల్లి ఎక్స్ రోడ్లో పెట్టిన నూతన శ్రీ గణేష్ వాటర్ సర్వీసింగ్ సెంటర్ ప్రారంభించిన తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి. మాజీ జెడ్పిటిసి పద్మ నరసింహా ముదిరాజ్, ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్, డిసిసి కార్యదర్శి రవీందర్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ డిగ్రీ కృష్ణ,మాజీ సర్పంచ్ రాజేందర్ రెడ్డి,లక్ష్మన్ నాయక్ , సీనియర్ నాయకులు డేవిడ్,రేణు రెడ్డి, అజీజ్, చిన్న, హరి,మోహన్ రెడ్డి , మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఆరిఫ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు చెన్నకేశవులు, రాజేంద్ర నాయక్, బి.యాదగిరి, తుమ్మ నరసింహ, గ్రామ అధ్యక్షుడు రమేష్, జూలపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గానుగుపహాడ్ చీటకోడూర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలి



**జనగామ,ఆగస్టు 03 సామాన్యుడి అస్త్రం దిన పత్రిక**

జనగామ న్యాయవాదులు గానుగుపహాడ్ చీటకోడూర్ వంతెన లు పూర్తి చేయాలి అని దీక్ష లో కూర్చున్నారు జనగామ కలెక్టరేట్ ముందు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు ఏడవ రోజు కు చేరుకున్నాయి.ఈ రోజు జనగామ న్యాయవాదులు గానుగుపహాడ్ చీటకోడూర్ వంతెన లు పూర్తి చేయాలి అని దీక్ష లో కూర్చున్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన సందీప్ అగ్రిమెంట్ ప్రకారం తొమ్మిది నెల ల లో వంతెన పనులు పూర్తి చేయని గానుగుపహాడ్ కాంట్రాక్టర్ ను బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మరియు చీటకోడుర్ వంతెన పనులకు టెండర్ లు పిలిచి పనులు ప్రారంభించాలి అని అన్నారు లేని యెడల కలెక్టరేట్ ను ముట్టడి చేస్తాము అని అన్నారు.ఈ దీక్ష లో సాధన సమితి అధ్యక్షుడు యాసారపు కరుణాకర్,రాగల్ల శ్రీహరి, చెరుకూరి కనకయ్య, కందగట్ల శ్రవణ్ కుమార్,జంజాల అభిషేక్,మాదిగ మేధావుల ఫోరం జనగామ జిల్లా అధ్యక్షుడు గొంగల్ల కుమార్,బిఆర్ఎస్ జిల్లా యువజన నాయకులు గట్టగల్ల శ్రీహరి పాల్గొన్నారు

## దళిత రత్న అవార్డులు ప్రధానం



**సామాన్యుడి అస్త్రం, మియాపూర్**

హైదర్ నగర్ యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ ఏర్పుల శ్రవణ్ కుమార్, ఐసిఐసిఐ బ్యాంక్ హౌసింగ్ ఫైనాన్స్ ఇన్చార్జి బేగరి నరసింహ లకు దళితరత్న అవార్డులను వారు ఆదివారం అందుకున్నారు.తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్,బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ ఇటుక రాజు మాదిగ చేతుల మీదుగా ఈ అవార్డులను వారికి అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఇటుక రాజు మాదిగ మాట్లాడుతూ ఏర్పుల శ్రవణ్ బేగరి నరసింహులు ఉద్యోగం చేస్తూ తమ వంతు సామాజిక బాధ్యతగా తన తోటి సమాజానికి ఎంతో కొంత సహాయం చేయాలని సంకల్పంతో తాము అనుభవించిన కష్టాలు బాధలు ఇతరులు పడకూడదన్న ఉద్దేశంతో వారు చేస్తున్న ఉద్యోగంతో పాటు వారి సామాజిక వర్గానికి ఎల్లవేళలా తమకు తోచిన సహాయని చేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఆయన కొనియాడారు. ఈ మేరకు వారి సామాజిక సేవను గుర్తించి దళిత రత్న అవార్డులను వారికి అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు నపారి చంద్రశేఖర్ కుసుమ భోగరాజు కల్పగురి శ్రీనివాస్ కొండూరి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తరాంధ్ర వెలుగులు.

**విశాఖపట్టణం**

ఆంధ్రప్రదేశ్లో అంతర్జాతీయ విమానాశ్రయానికి ముహూర్తం ఖరారయింది. 2026లోనే ఈ విమానాశ్రయం నుంచి విమానాల రాకపోకలు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రిగా ఇదే ప్రాంతానికి చెందిన యువ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు ఉండటంతో ఇక ఈ పనులు అనుకున్న సమయానికి పూర్తి చేయడానికి అధికారులు రేయింబవళ్లూ కష్టపడుతున్నారు. మంత్రి ఇలాకాలో అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తి చేసి వీలయితే ప్రధాని నరేంద్ర మోదీ చేత ప్రారంభించాలన్న ఆలోచనలో ఉన్నారు. విజయనగరం జిల్లా భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి.అయితే విశాఖపట్నం ఎయిర్ పోర్టు కు ప్రత్యామ్నాయంగా ఈ భోగాపురం విమానాశ్రయం రూపుదిద్దుకోవడం,

# బీటెక్ రెండేళ్లు చదివాక బయటికి వెళ్లే అవకాశం

**హైదరాబాద్ :** బీటెక్ కోర్సులు, సిలబస్ నవీకరణకు సంబంధించిన జేఎన్‌టీయూ రెగ్యులేషన్-25 ముసాయిదా సిద్ధం అయింది. ఈ సంవత్సరం సిలబస్‌లో మార్పులు, కోర్సు అమరిక (స్ట్రక్చర్)పై ఇప్పటికే బీవోఎస్ (బోర్డ్ ఆఫ్ స్టడీస్) సమావేశాలు ముగిసిన విషయం తెలిసిందే. కాలేజీల ప్రిన్సిపాళ్ల నుంచి సూచనలు, సలహాలు : యూనివర్సిటీ అధికారులు, గుర్తింపు పొందిన కాలేజీల ప్రతినిధులతో పాటు ఐఐటీ, ఎన్‌ఐటీ, వివిధ పరిశ్రమల నిపుణుల సూచనల మేరకు వర్సిటీ అకడమిక్ అండ్ ప్లానింగ్ (డీఏపీ) అధికారులు గురువారం ముసాయిదాను సిద్ధం చేశారు. ఉపకులపతి టి.కిషన్‌కుమార్ రెడ్డి ఆమోదం మేరకు డీఏపీ డైరెక్టర్ వి.కామాక్షి ప్రసాద్ దీన్ని డీఏపీ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకుని వచ్చారు. ఈ ముసాయిదాపై కాలేజీల ప్రిన్సిపాళ్ల నుంచి సూచనలు, సలహాలకు శనివారం రాత్రి వరకు అవకాశం అచ్చారు. అనంతరం ఆర్-25 తుది నివేదిక తయారవుతుంది. ఇప్పటివరకు నాలుగు సంవత్సరాల బీటెక్ కోర్సులో 160 క్రెడిట్లు ఉండేవి. ప్రతి స్టూడెంట్?కు తప్పనిసరిగా 160 రావాల్సిందే. అప్పుడే యూజీ పట్టా వస్తోంది. దీనిలో మార్పు చేస్తూ మొత్తం క్రెడిట్లను 164కు పెంచుతూ అందులో 4 క్రెడిట్లకు మినహాయింపును ఇచ్చారు. అంటే 164లో 160 క్రెడిట్లు వస్తే పట్టా సాధించవచ్చు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ద్వితీయ, తృతీయ ఏడాదిలో ఉండే 4 నైపుణ్యాభివృద్ధి శిక్షణ సబ్జెక్టులకు ఒక్కోదానికి ఒక క్రెడిట్ ఇస్తారు. బీటెక్ రెండు సంవత్సరాలు చదివిన తరువాత కోర్సు నుంచి బయటికి వెళ్లాలని అనుకుంటే అవకాశం కల్పిస్తూ, రెండు సంవత్సరాలకు డిప్లొమా సర్టిఫికెట్ ఇస్తారు. తరువాత స్టూడెంట్? బీటెక్‌లో తిరిగి చేరాలని అనుకుంటే మొదట ప్రవేశించిన సంవత్సరం నుంచి ఎనిమిది సంవత్సరాలలోపు ఎప్పుడైనా మూడో ఏడాది నుంచి ఇంజినీరింగ్ కోర్సును పూర్తి చేసే అవకాశం కల్పించారు. మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సుల (మూక్స్)ను స్టూడెంట్స్? ముందస్తుగానే పూర్తి చేసుకునే అవకాశం ఇచ్చారు. పర్యావరణశాస్త్రం, భారతీయ జ్ఞాన పద్ధతులు, భారత రాజ్యాంగం కోర్సులకు క్రెడిట్ ఇస్తున్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో ఒక సెమిస్టర్ ఎగ్జామ్? రాయలేకపోయిన స్టూడెంట్స్? తిరిగి పరీక్ష రాసుకునేందుకు సీబీటీ (కంప్యూటర్ ఆధారిత పరీక్ష)ను ప్రవేశపెట్టనున్నారు. ప్రతి కోర్సులో మైనర్ ప్రోగ్రామ్‌లు జత చేశారు. ఇంజినీరింగ్ రెండో సంవత్సరం నుంచే పరిశ్రమల స్థాపన దిశగా స్టూడెంట్స్?ను ప్రోత్సహించేలా స్టార్టప్‌లతో పాటు ఆంత్రప్రెన్యూర్‌షిప్ అవకాశాలను కల్పిస్తారు. గణిత ప్రయోగశాలలు సైతం ఏర్పాటు చేయనున్నారు. విదేశీ యూనివర్సిటీలతో ఒప్పందం : తెలంగాణ రాష్ట్ర విద్యార్థుల హైదరాబాద్?లోని జేఎన్?టీ యూనివర్సిటీ అద్భుతమైన అవకాశం కల్పిస్తోంది. జర్మనీలో ఇంజినీరింగ్, ఎం.ఎస్. చేయడానికి, డ్యూయల్ డిగ్రీ, ఇంటిగ్రేటెడ్? ఇంజినీరింగ్ కోర్సులను అందించేందుకు జర్మనీలోని రెండు విశ్వవిద్యాలయాలతో జూన్ 20 న జేఎన్?టీయూ ప్రతినిధులు ఒప్పందం కుదుర్చుకున్నారు. బాడెన్ ఊటెన్ బర్గ్‌లోని కేఎఫ్ఆర్ యూనివర్సిటీ, హాసెన్ రాష్ట్రంలోని కాసెల్ యూనివర్సిటీ ప్రతినిధులతో జేఎన్టీయూ ఉపకులపతి టి.కిషన్ కుమార్ రెడ్డి ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఇంజినీరింగ్, ఎంటెక్ కోర్సుల్లో అడ్మిషన్లు పొందేందుకు జేఈఈ మెయిన్స్, ఎప్‌సెట్‌లలో మెరుగైన ర్యాంకులు సాధించిన విద్యార్థులు, సీబీఎస్‌సీ 12వ తరగతిలో అత్యుత్తమ జీపీఏ కలిగిన విద్యార్థులే అర్హులని రిజిస్ట్రార్ డాక్టర్ కేవీరావు ఈ మేరకు వెల్లడించారు.



## హైదరాబాద్ కలెక్టర్ హరిచందనపై సీఎస్‌కు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్



**హైదరాబాద్ :** కలెక్టర్ హరిచందన, సివిల్ సప్లైస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ రేషన్ కార్డుల విషయంలో తప్పుడు ప్రకటనలు చేసి ప్రజలను తప్పుదారి పట్టించారని బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకుప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణకు ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్ గౌడ్ ఫిర్యాదు చేశారు. ఇటీవల హైదరాబాద్ బంజారాహిల్స్‌లో నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో హరిచందన, డీఎస్ చౌహాన్ పాల్గొన్నారని.. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేశారని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. 'గత పదేళ్లలో కొత్త రేషన్ కార్డుల ఇచ్చిన దాఖలాలు లేవు. చాలామంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఒక్కటి కూడా ఇవ్వలేదు' అని డీఎస్ చౌహాన్ అన్నారని తెలిపారు. అలాగే 'గత 12 ఏళ్ల కింద నేను సబ్ కలెక్టర్‌గా ఉన్నప్పుడు రేషన్ కార్డులు ఇచ్చాం. మళ్లీ ఇప్పుడే ఇస్తున్నాం' అని హరిచందన వ్యాఖ్యానించారని పేర్కొన్నారు. ఇవన్నీ తప్పుడు ఆరోపణలేనని.. బీఆర్ఎస్ ప్రభుత్వం నిబంధనల ప్రకారం 6.47 లక్షల రేషన్ కార్డులను ఇచ్చిందని ఆ లేఖలో వివరించారు. అధికారులు ప్రజాప్రతినిధుల మెప్పు కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. ఇది ప్రజాస్వామ్యానికి హానికరమని అన్నారు. తప్పుడు ప్రచారం చేస్తున్న సదరు అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. అధికారుల పనితీరును డీపీవోటీకి నివేదించాలని కోరారు. సదరు అధికారులు బహిరంగ క్షమాపణతో పాటు వాస్తవాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

## బోనాల వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

**శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి డివిజన్ లోగల లింగంపల్లి విలేజ్ లో బోనాల పండుగను పురస్కరించుకుని పోచమ్మ తల్లి,మహంకాళి తల్లి,నల్ల పోచమ్మ తల్లి ఆలయాల్లో విలేజ్ కమిటీ వారి ఆహ్వానానికి శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరేఖపూడి గాంధీ, ఎంబీసీ ఛైర్మెన్ జెరిపేటి జైపాల్ తో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్న శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్.కార్పొరేటర్ మాట్లాడుతూ..అమ్మవారి కృప ఎల్లప్పుడూ శేరిలింగంపల్లి ప్రజలపై ఉండాలని, ప్రతి ఇంట్లో ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం నిలకడగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. బోనాల వేడుకను, ఫలహారం బండి, తొట్టేల ఊరేగింపుల్లో అందరూ కులమతాలకు అతీతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, రాష్ట్ర యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్, ఎస్ఎల్ విడి సి ప్రెసిడెంట్ గడ్డం రవి యాదవ్, కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, కమిటీ జెనరల్ సెక్రటరీ దేవులపల్లి శ్రీనివాస్, పాశం రాజు, అధ్యక్షులు మేకల కృష్ణ, సోమయ్య యాదవ్, నీలి జ్ఞానేశ్వర్,ప్రణయ్ ముదిరాజ్, బుయ్య మల్లేష్ గౌడ్,సుభాష్ రాథోడ్,సూర్య రాథోడ్, పిల్లి అనిల్, రవి, శశి కిరణ్, బ్యాండ్ రాజు,బ్యాండ్ రమేష్,నవీన్ గౌడ్, నరేష్, గోపాల్ యాదవ్,నయీమ్ స్థానికవాసులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి.. ఎమ్మెల్యే కోవ లక్ష్మి




**వాంకిడి :** అర్హులందరూ కొత్త రేషన్ కార్డుల కోసం మీ సేవలో దరఖాస్తులు చేసుకోవాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్య కోవలక్ష్మి, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. శనివారం వాంకిడి మండల కేంద్రంలోని రైతు వేదికలో పలువురి లబ్ధిదారులకి కొత్త రేషన్ కార్డుల పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, తహసీల్దార్ కవిత, డీటీ రాంమ్‌లాల్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఆర్ఐలు, సింగిల్ విండో చైర్మన్ జాబో రే పెంటు, సీనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

**రెబ్బెనలో..**

రెబ్బెన, ఆగస్టు 2 : రెబ్బెన మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం లబ్ధిదారులకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సూర్యప్రకాశ్, ఎంపీడీవో శంకరమ్మ, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, ఆర్టీఏ మెంబర్ లావుడ్య రమేశ్ ఉన్నారు.

# నాడు ఆదరణ.. నేడు నిరాదరణ

**అద్భుత పథకానికి మంగళం**

**కిట్ల కోసం దవాఖానల్లో ఎదురుచూపులు**

**గజ్వేల్ మాతాశిశు దవాఖానలో ప్రతినెలా 400 వరకు డెలివరీలు**

**కిట్ అందక ఇబ్బంది పడుతున్న బాలింతలు**



**గజ్వేల్ :** ప్రభుత్వ దవాఖానల్లో పుట్టిన పిల్లల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ కిట్‌ను దిగ్విజయంగా అమలు చేసింది. ఈ పథకం ప్రజల్లో ఎంతో ఆదరణ పొందింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కేసీఆర్ కిట్‌ను పక్కన పెట్టి పథకాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. కేసీఆర్ కిట్లను సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆసక్తి చూడడంలేదు. దీంతో నాడు ఎంతో ఆదరణ పొందిన పథకం.. నేడు అటకెక్కింది. ప్రభుత్వ దవాఖానల్లో కిట్లను అందించకపోవడంతో బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2017లో 16 రకాల వస్తువులతో కూడిన కేసీఆర్ కిట్‌ను ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవించిన బాలింతలకు పంపిణీ చేయడంతో పాటు ఆడశిశువు జన్మిస్తే రూ.13వేలు, మగ శిశువు జన్మిస్తే రూ.12వేలను ఖాతాలో జమ చేసింది. వీటన్నింటికి కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పాడినట్లు పరిస్థితులను బట్టి తెలుస్తున్నది. ప్రభుత్వ దవాఖానల్లో డెలివరీ అయిన మహిళలకు కిట్ అందక ఇబ్బందులు పడుతున్నారు. కేసీఆర్ కిట్ అమలు తర్వాత సర్కార్ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. దవాఖానల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు ఒకవైపు, మెరుగైన సౌకర్యాలను కల్పిస్తూనే మరోపక్క కేసీఆర్ కిట్‌తో పాటు ప్రోత్సాహకంగా కేసీఆర్ ప్రభుత్వం డబ్బులు అందజేసింది. మహిళలు గర్భం దాల్చిన తరువాత గ్రామాల్లో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు గర్భిణుల వివరాలు సేకరించేవారు. అనంతరం వారి వివరాలను ఆన్‌లైన్ చేసి దవాఖానల్లో వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి డబ్బులు ఖాతాలో జమచేసేవా రు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ దవాఖానలో డెలివరీ అయిన తర్వాత 102 వాహనంలో తల్లీబిడ్డను తీసుకెళ్లి ఇంటి వద్ద వదిలి పెట్టేవారు. నేడు కాంగ్రెస్ ప్రభు త్వం ఇవన్నీ అమలు కావడం లేదు.

**గజ్వేల్ ఎంసీహెచ్‌లో..**

గజ్వేల్‌లోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో(ఎంసీహెచ్) ప్రతిరోజు 15 నుంచి 20వరకు డెలివరీలు అవుతున్నాయి. అందులో సాధారణ ప్రసవాలకు ఎక్కువగా వైద్యులు ప్రయత్నం చేస్తున్నారు. ప్రతినెలలో ఒక్క గజ్వేల్ దవాఖానలోనే 350 నుంచి 400వరకు డెలివరీలు అవుతున్నాయి. వీరంతా కిట్ అందుకోలేకపోతున్నారు. కేసీఆర్ కిట్‌కు వచ్చిన ఆదరణను చూసి ఈ పథకాన్ని ఇలాగే కొనసాగిస్తే కేసీఆర్‌కే పేరు వస్తదనే భయంతో కిట్ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం స్వస్తి పలికిందనే ఆరోపణలు ఉన్నాయి.

**ఎంసీహెచ్‌గా పేరు మార్పు..**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కేసీఆర్ హయాంలో మిగిలిన కిట్లను స్టాక్‌లో ఉన్న వాటికి కేసీఆర్ ఫొటో ఉంటే దానిపై స్టిక్కర్ అతికించి కేసీఆర్ కిట్ పేరుకు బదులు మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్(ఎంసీహెచ్) పేరుగా మార్చి అందుబాటులో ఉన్న వాటిని అందించారు. పాత స్టాక్ అయిపోయిన తర్వాత కొత్త కిట్ల పంపిణీకి కాంగ్రెస్ ప్రభుత్వం స్వస్తి పలికింది. ఇప్పటికి గ్రామాల్లో గర్భిణుల నుంచి ఆధార్ కార్డు, బ్యాంకు వివరాలు ఆశ వర్కర్లు సేకరించి ఆన్‌లైన్ చేస్తున్నప్పటికీ కిట్లు, డబ్బులు అందడం లేదు. కిట్లు, డబ్బులు ఇవ్వకుండా వివరాలు సేకరించడంతో గర్భిణులు ఆశ కార్యకర్తలను తమ వివరాలు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తున్నారు.

# డిసెంబర్ 9లోపు ప్యాకేజీ పూర్తి చెల్లింపు

## సీఎం హామీని తెలియజేసిన అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల :** డిసెంబర్ 9 లోపు సీఎం హామీతో ప్రతి రూపాయిని ఉదండాపూర్ వల్లూరు ముంపు గ్రామస్తుల ఇంటికి చేర్చే బాధ్యత తనదేనని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 175 కోట్ల రూపాయలను ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద విడుదల చేసిన శుభ సందర్భంగా ఆదివారం ఉదండాపూర్ రిజర్వాయర్లో ముంపు గ్రామాల ప్రజలకు సామూహిక భోజనాలు ఏర్పాటు చేశారు. విలక్షణ రాజకీయ లక్షణాలతో రాష్ట్రంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఉదండాపూర్ ప్రాజెక్టు నిర్వాసితులకు వినూత్న రీతిలో వేల మందికి భోజనం పెట్టి వారికి రావలసిన ప్రతి పైసా అందే వరకు వారికి అండగా నిలుస్తానని దీనికోసం ఏం చేయడానికైనా తాను సిద్ధమేనని ప్రకటించి నిర్వాసితుల గుండెల్లో కొండంత భరోసా నింపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఉదండాపూర్ ప్రాజెక్ట్ నిర్వాసితుల గూడును గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పట్టించుకో పోగా వారి సమస్యలను గాలికి వదిలేసిన నేపథ్యంలో వారికి అండగా నిలబడతానని అవసరమైతే సర్కారుతోనైనా కలబడుతానని హామీ ఇచ్చి రంగంలోకి దిగిన అనిరుద్ రెడ్డి తన నిర్విరామ ప్రయత్నాలతో ఒకవైపు నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని రూ.25 లక్షల కు పెంచే విషయంగా ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తెస్తూనే, మరొకవైపు మూడు విడతలుగా రూ.250 కోట్లను నిర్వాసితుల ప్యాకేజీ కోసం మంజూరు చేయించారు. లక్షల మంది రైతుల బాగు కోసం ఉదండాపూర్ నిర్వాసితులు చేసిన త్యాగం అమూల్యమైనది. ఆ త్యాగధనుల కోసం చివరి వరకు తాను అండగా నిలబడతానని ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఉదండాపూర్ ప్రాజెక్టు లో భాగమైన వల్లూరు గ్రామం వద్ద వేలాదిమంది నిర్వాసితులతో సహపంతి భోజనం చేశారు.



వారికి తానే స్వయంగా అన్నం వడ్డించారు. పుట్టి పెరిగిన ఊర్లను, ఇళ్లను పోగొట్టుకుంటున్నామన్న బాధతో కంటతడి పెట్టుకుంటున్న వారికి భుజం తట్టి ధైర్యం చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాకు ఫోన్ చేసి ఉదండాపూర్ భూ నిర్వాసితులకు మనం అండగా ఉండాలి, నీవు వెళ్లి వారికి నా తరఫున భోజనం పెట్టమని చెప్పారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. డిసెంబర్ 9వ తారీకు లోపు ఉదండాపూర్ భూ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిధులను పూర్తిగా చెల్లిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సందర్భంగా ఉదండాపూర్ నిర్వాసితులు తమకు అండగా నిలిచిన ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిని గజమాలతో ఘనంగా సత్కరించారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి అనిరుద్ రెడ్డి గవర్నమెంట్ అని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిధులను మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు శ్రీను, రామాంజనేయులు, జలంధర్, మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి, కౌన్సిలర్లు చైతన్య చౌహాన్, కుమ్మరి రాజు, సుంకసారి రమేష్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బుర్ల వెంకటయ్య, టౌన్ అధ్యక్షుడు మినాజోద్దీన్, మాజీ ఎంపీపీ నిత్యానందం, లైన్స్ క్లబ్ అధ్యక్షుడు బాద్మీ ధ్రువ, మాజీ సర్పంచ్ బుక్క వెంకటేశం, నేతలు అశోక్ యాదవ్, అనిల్ కుమార్, వంశీధర్ రెడ్డి, వంశి చారి, జగదీశ్వర చారి, భాస్కర్ రెడ్డి, లక్ష్మణ్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా క్షేత్రంలోనే కాంగ్రెస్‌కు గుణపాఠం



**సిరిసిల్ల :** అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్.. వాటిని అమలు చేయడంలో విఫలమయిందని కేటీఆర్ సేనా మండల అధ్యక్షుడు నందగిరి భాస్కర్ గౌడ్ విమర్శించారు. అబద్ధపు హామీలతో ప్రజలను పూర్తిగా మోసం చేసిందని, ప్రజాక్షేత్రంలోనే ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతాన్నారు. తంగళ్ళపల్లి మండలం ఓబులాపూర్ కేటీఆర్ సేన గ్రామ శాఖ అధ్యక్షునిగా వోడ్నాల మహేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ యువతను చైతన్య పరిచి, గ్రామ గ్రామాన కేటీఆర్ సేనను బలోపేతం చేస్తామన్నారు. సిరిసిల్ల నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని, బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో చేసిన సంక్షేమ పథకాలను గడప గడపకు వివరిస్తామని చెప్పారు. ఏ ఎన్నిక వచ్చినా కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీనే గెలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు దోమల కొమురయ్య, కొత్త సంతోష్ గౌడ్, గోగు మల్లేశం,బొమ్మ దేవయ్య, నందగిరి నాగరాజు, నందగిరి సురేందర్, దోమల హరీష్, దోమల వంశీ, వోడ్నాల శ్రీకాంత్, తొట్ల శివాజీ, పోచంపల్లి కిషన్, పోచంపల్లి నితిన్, పరుస ప్రశాంత్, పరుస నవీన్, గుగ్గిళ్ళ ప్రశాంత్, అల్వాల చింటూ, కొత్త అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ పోస్టర్‌తో నా కల నెరవేరింది: ఆనంద్ దేవరకొండ



ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్ హీరోలుగా, వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటించిన చిత్రం 'బేబి'. ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ చిత్రం 2023 జూలై 13న విడుదలైంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ అవార్డ్స్‌లో ఈ సినిమాకి ఉత్తమ స్క్రీన్ ప్లే రైటర్‌గా సాయి రాజేశ్, ఉత్తమ ప్లే బ్యాక్ సింగర్‌గా పీవీఎన్‌ఎస్ రోహిత్ జాతీయ అవార్డుకి ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చిత్రబృందం మాట్లాడారు. సాయి రాజేశ్ మాట్లాడుతూ– 'బేబి'సినిమాకు ప్రతి ఒక్కరూ హీరోనే... అంతా ప్రాణం పెట్టి పని చేశారు. మాకు వచ్చిన బెస్ట్ స్క్రీన్ ప్లే అవార్డ్ మా ఎడిటర్ విప్లవ్‌కి కూడా చెందాలి. నన్ను ఎవరూ నమ్మని రోజు ఎస్‌కేఎన్ నమ్మినందుకు థ్యాంక్స్" అని చెప్పారు. బేబి సినిమా కోసం టీమ్ మొత్తం ప్రాణం పెట్టి పని చేశాం. మా చిత్రం జాతీయ అవార్డు గెల్చుకోవడం ఆనందంగా ఉంది. నా సినిమా పోస్టర్ మీద నేషనల్ అవార్డ్ విన్నర్ అనే పేరు చూడటంతో నా కల నెరవేరిన అనుభూతి కలుగుతోందని హీరో ఆనంద్ దేవరకొండ తెలిపారు. బేబిలో ప్రేమిస్తున్నా అనే పాటకి బెస్ట్ సింగర్‌గా జాతీయ అవార్డు అందుకోనుండటం సంతోషంగా ఉందని సింగర్ పీవీఎన్‌ఎస్ రోహిత్ పేర్కొన్నారు. ఈ సినిమాలో నేనూ భాగమైనందుకు చాలా హ్యాపీగా ఉందన్నారు హీరోయిన్ వైష్ణవి చైతన్య. నిర్మాత ఎస్‌కేఎన్ మాట్లాడుతూ బేబికి జాతీయ అవార్డులు రావడంతో మరిన్ని మంచి చిత్రాలు చేయాలనే బాధ్యత మాపై పెరిగిందని అన్నారు.




# తమిళ స్టార్ దర్శకులంతా ఒకే ఫ్రేములో.. నెట్టింట వైరల్‌గా మారిన పిక్

ఇటీవల సినీ పరిశ్రమలో రీ యూనియన్ ట్రెండ్ బాగా హైలైట్ అయింది. సీనియర్ నటీనటులు, దర్శకులు కలిసి గత జ్ఞాపకాలను పునరుద్ధాటిస్తూ ఆనందంగా గడిపేస్తున్నారు. ఇటీవల 90ల కాలంలో సూపర్ హిట్స్ అందించిన తమిళ్, తెలుగు నటీనటులు కలిసి రీ యూనియన్ పార్టీ చేసుకున్న సంగతి మనకు తెలిసిందే. తాజాగా, తమిళ్ సినీ పరిశ్రమకు వెలకట్టలేని కృషి చేసిన దర్శకులు ఒకే చోట సమావేశమై ఒక ఫోటో కోసం పోజ్ ఇవ్వగా, ఆ చిత్రాన్ని దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా షేర్ చేశారు. ఈ ఫోటో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఫోటోలో గౌతమ్ వాసుదేవ్ మీనన్, నెల్సన్ దిలీప్ కుమార్ (ఈ జెనరేషన్‌కు బాగా పరిచితమైన దర్శకుడు), శంకర్ (విజువల్ వండర్స్‌కు కేరాఫ్ అడ్రస్), మణిరత్నం (క్లాసికల్ మాస్టర్‌పీసులకు మారుపేరు), మిస్కిన్ (ఇంటెన్స్ నరేషన్‌కి పేరుగాంచిన దర్శకుడు), లింగుస్వామి (కమర్షియల్ హిట్‌లకు స్పెషలిస్ట్), మురుగదాస్ (పాన్ ఇండియా విజయాల కారకుడు), కేఎస్ రవికుమార్ (సినిమా మాస్టర్, స్టార్ హీరోల ఫేవరెట్ డైరెక్టర్) అందరు కూర్చొని ఫొటోకి పోజులిచ్చారు. ఈ ఫోటో సోషల్ మీడియాలో షేర్ చేసిన క్షణాల్లోనే వైరల్ అవగా, తమిళ్ ప్రేక్షకులతో పాటు తెలుగు సినీ ప్రేమికులు కూడా వీరందరు ఇలా కలవడం చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. "అందరూ కలిసి ఒకే ఫ్రేమ్‌లో ఉండడం అరుదైన సన్నివేశం", "ఈ ఒక్క ఫోటోలో సుమారు 100 బ్లాక్‌బస్టర్లు దాగున్నాయ్" అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.ఈ రీ యూనియన్ పార్టీ ఎక్కడ జరిగింది? ఎందుకు సమావేశమయ్యారు అన్నదానిపై స్పష్టత రాకపోయినా, ఈ తరహా మీటింగ్‌లు టాలెంటెడ్ మేకర్స్ మధ్య బంధాన్ని బలపరిచే అవకాశం కల్పిస్తాయన్నది మాత్రం స్పష్టంగా అర్థమవుతుంది.. సినిమా ప్రేమికులకు ఇది నిజంగా ఒక విజువల్ ట్రీట్.

# తెలుగులోకి రాబోతున్న కన్నడ బ్లాక్ బస్టర్ 'సు ఫ్రమ్ సో'




చిన్న సినిమాగా విడుదలై కన్నడలో బ్లాక్ బస్టర్ విజయం సాధించిన సినిమా తెలుగులో విడుదల కాబోతుంది. ఈ సినిమా తెలుగు రైట్స్‌ని ప్రముఖ టాలీవుడ్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ దక్కించుకుంది. త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించనున్నట్లు తెలిపింది. జూలై 25న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తూ, విశ్లేషకుల ప్రశంసలు అందుకుంటోంది. రాజ్ బి శెట్టి సహ–నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రాన్ని జెపి తుమినాడ్ దర్శకత్వం వహించారు. హారర్ కామెడీ జానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రం, వినూత్నమైన కథాంశంతో కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కింది. తాజాగా ఈ చిత్రం కన్నడలో అరుదైన రికార్డును నమోదు చేసుకుంది. కేవలం రూ.3 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటివరకు రూ.28 కోట్ల వరకు వసూళ్లను రాబట్టింది. అంతేగాకుండా కేవలం మూడు రోజుల్లోనే ఈ చిత్రం 3.80 లక్షలకు పైగా టిక్కెట్లు అమ్ముడై, ఒకే రోజులో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో అత్యధిక టిక్కెట్లు అమ్ముడైన కన్నడ చిత్రంగా రికార్డు సృష్టించింది.




# అప్పుడే ఓటీటీలోకి గాలి జనార్ధనరెడ్డి కుమారుడి సినిమా

మాజీ మంత్రి, ప్రముఖ రాజకీయ నాయకుడు గాలి జనార్దన్ రెడ్డి కుమారుడు కిరిటీ రెడ్డి హీరోగా నటించిన మొదటి సినిమా జూనియర్. దర్శకుడు రాధాకృష్ణ రెడ్డి తెరకెక్కించిన ఈ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ లో శ్రీలీల హీరోయిన గా నటించింది. అలాగే కన్నడ నటుడు రవిచంద్రన్, జెనీలియా డిసౌజా కీలక పాత్రలు పోషించారు. జులై 18న కన్నడతో పాటు తెలుగులో ఒకేసారి విడుదలైన జూనియర్ సినిమా ఓ మోస్తరుగా ఆడింది. ముఖ్యంగా ఇందులోని వైరల్ వయ్యారి పాట సోషల్ మీడియాను షేక్ చేసింది. శ్రీలీలతో పాటు కిరిటీ రెడ్డి వేసిన స్టెప్పులు సినిమాలో హైలెట్ గా నిలిచాయి. బాక్సాఫీస్ వద్ద ఓ మోస్తరుగా ఆడిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి రానుంది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆగస్ట 9 నుంచే ఈ సినిమాను స్ట్రీమింగ్ కు తీసుకురానున్నట్లు వార్తలు వస్తున్నాయి. నిజానికి ఈ సినిమా ఆగస్ట్ 15 న ఓటీటీలోకి రానుందని మొదట ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు ఒక వారం ముందే స్ట్రీమింగ్ కు రానున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. వారాహి చలన చిత్రం బ్యానర్ పై తెరకెక్కిన ఈ సినిమాలో రావు రమేష్, సత్య, వైవా హర్ష, సుధారాణి వంటి ప్రముఖ టాలీవుడ్ నటులు యాక్ట్ చేశారు. అలాగే ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించడం విశేషం.




# వీకెండ్‌లో కింగ్‌డమ్ దూకుడు..

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ నటించిన కింగ్డమ్ సినిమా బాక్సాఫీస్ వద్ద దూసుపోతుంది. డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన ఈ స్పై గ్యాంగ్ స్టర్ యాక్షన్ డ్రామాకు మొదటి నుంచి మంచి రెస్పాన్స్ వస్తుంది. భారీ అంచనాల మధ్య జూలై 31న విడుదలైన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ టాక్ అందుకుంది. అలాగే మొదటి రోజే భారీ వసూళ్లు రాబట్టింది. ఇప్పటివరకు విజయ్ కెరీర్ లోనే ఓపెనింగ్ రోజునే భారీ వసూల్లు రాబట్టిన చిత్రంగా నిలిచింది. ఇక ఆ తర్వాత రోజు సైతం కలెక్షన్ల సునామీ సృష్టిస్తుంది. మొదటి రోజు రూ.39 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టిన ఈ చిత్రం రెండు రోజులకు గానూ రూ.53 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టినట్లు చిత్రయూనిట్ తెలిపింది. తాజాగా కింగ్డమ్ మూవీ మూడు రోజుల కలెక్షన్స్ అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఈ సినిమా మూడు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.67 కోట్లు గ్రాస్ కలెక్షన్స్ వసూలు చేసినట్లు అధికారికంగా వెల్లడించారు. ఈ సినిమాకు 53 కోట్ల వరుక థియేట్రికల్ బిజినెస్ జరిగినట్లు తెలుస్తోంది. ఇక ఈ ఆదివారంతోపాటు వచ్చే వారం సైతం కింగ్డమ్ వసూళ్లు మరింత పెరగనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో విజయ్ మాస్ యాక్షన్ అదరగొట్టారు. ఇక ఇందులో విజయ్ , సత్యదేవ్ మధ్య వచ్చే సీన్స్ ఆకట్టుకున్నాయి. అనిరుధ్ రవిచంద్రన్ అందించిన బీజీఎమ్ సినిమాకు హైలెట్ అయ్యింది. ఈ చిత్రంలో విజయ్ జోడిగా భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించి సంగతి తెలిసిందే.

## బిజినెస్

## ఏడబ్ల్యూఎస్ కొత్త సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ మోడల్




బెంగళూరు: అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) కొత్తగా ఏఐ డ్రివెన్ డెవలప్‌మెంట్ లైఫ్‌సైకిల్ మోడల్‌ను ఆవిష్కరించింది. కైరో, అమెజాన్ క్యూ డెవలపర్‌లాంటి టూల్స్‌ను ఉపయోగించి, కృత్రిమ మేథ (ఏఐ)తో సాఫ్ట్‌వేర్‌ను రూపొందించేందుకు ఇది ఉపయోగపడుతుంది. దీనితో మానవ పర్యవేక్షణలో కోడింగ్, టెస్టింగ్‌లాంటి పనులను ఆటోమేట్ చేయడం ద్వారా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసే వ్యవధిని నెలల నుంచి రోజుల స్థాయిలోకి కుదించవచ్చని సంస్థ తెలిపింది. అలాగే మెరుగైన ఏఐ విధానాలను షేర్ చేసుకునేందుకు ఏఐ-నేటివ్ బిల్డర్స్ కమ్యూనిటీని కూడా ప్రవేశపెట్టినట్లు వివరించింది. అటు ఏడబ్ల్యూఎస్ స్కిల్ బిల్డర్ ద్వారా అంతర్జాతీయంగా 27 లక్షల మంది విద్యార్థులకు, ఉచితంగా ఏఐ ట్రైనింగ్ యాక్సెస్ అందిస్తున్నట్లు ఏడబ్ల్యూఎస్ తెలిపింది. జనరేటివ్ ఏఐని ఉపయోగించి వాస్తవ ప్రపంచపు సవాళ్లను పరిష్కరించే డెవలపర్లకు 2 మిలియన్ డాలర్ల విలువ చేసే క్రెడిట్స్‌ను ఇచ్చేలా ఏడబ్ల్యూఎస్ ఏఐ లీగ్‌ను కూడా ప్రకటించింది.

### 7 నుంచి జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఐపీఓ

ప్రముఖ పారిశ్రామికవేత్త సజ్జన్ జిందాల్‌కు చెందిన జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ సంస్థ జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 7న ప్రారంభమై 11న ముగియనుంది. ఐపీఓ ద్వారా నిధుల సమీకరణ లక్ష్యాన్ని మాత్రం కంపెనీలో గతంలో నిర్దేశించుకున్న రూ.4,000 కోట్ల నుంచి రూ.3,600 కోట్లకు తగ్గించుకుంది. ఐపీఓలో భాగంగా రూ.1,600 కోట్ల తాజా ఈక్విటీని జారీ చేయడంతో పాటు ప్రస్తుత వాటాదారులకు చెందిన రూ.2,000 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనున్నట్లు సెబీకి సమర్పించిన రెడ్ హియరింగ్ ప్రాస్పెక్టస(ఆర్‌హెచ్‌పీ) లో కంపెనీ వెల్లడించింది. ఓఎఫ్ఎస్ ద్వారా ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం అపోలో మేనేజ్‌మెంట్ రూ.931.80 కోట్లు, సినర్జీ మెటల్స్ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్ రూ.938.50, ప్రభుత్వ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ రూ.129.70 కోట్ల విలువైన వాటాను ఉపసంహరించుకోనున్నాయని జేఎసడబ్ల్యూ వెల్లడించింది. ఆర్సిల్ ఐపీఓ కోసం దరఖాస్తు: అవెన్యూ క్యాపిటల్ పెట్టుబడులు కలిగిన అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ ఇండియా లిమిటెడ్ (ఆర్సిల్).. ఐపీఓ ద్వారా నిధుల సమీకరణకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులు 10.54 ఈక్విటీ కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనున్నట్లు డీఆర్‌హెచ్‌పీలో కంపెనీ పేర్కొంది.

# యూపీఐలో వచ్చిన మార్పులేమిటంటే

మీరు ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే వంటి డిజిటల్ చెల్లింపుల యాప్‌లు వాడుతున్నారా..? ఈ యాప్‌ల ద్వారా యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలను వినియోగించుకుంటున్నారా..? అయితే, ఈ వార్త మీ కోసమే. ఎందుకంటే ఈ నెల 1 నుంచే యూపీఐ సేవల్లో కొన్ని మార్పులు వచ్చాయి. అయితే, ఈ మార్పులతో రోజువారీ చెల్లింపులపై ఎలాంటి ప్రభావం ఉండనప్పటికీ, యూపీఐ సేవల వినియోగంపైన మాత్రం యూపీఐ అభివృద్ధి, నిర్వహణ సంస్థ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొన్ని పరిమితులను విధించింది. ఆ వివరాలు..




**బ్యాంక్ బ్యాలెన్స్**

ఇప్పటివరకు వినియోగదారులకు యూపీఐ ద్వారా అనుసంధానిత బ్యాంకు ఖాతాలో ఎంత నగదు ఉందని ఎన్ని సార్లైనా పరిశీలించే వెసులుబాటు ఉంది. తాజాగా ఈ సేవలపై ఎన్‌పీసీఐ పరిమితి విధించింది. ఈ నెల 1 నుంచి ఒక్కో యూపీఐ యాప్ నుంచి రోజులో 50 సార్లు మాత్రమే బ్యాంకు అకౌంట్‌లోని బ్యాలెన్స్‌ను చెక్ చేసుకునే వీలుంటుంది. అత్యధిక లావాదేవీలు చోటు చేసుకునే సమయాల్లో వ్యవస్థపై ఒత్తిడిని తగ్గించేందుకు ఎన్‌పీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, యూపీఐ యాప్ నుంచి జరిపే ప్రతి చెల్లింపు పూర్తయ్యాక మీ ఖాతాలో నిల్వ ఎంత మిగిలి ఉందనేది వెంటనే చూడగలుగుతారు.

**ఆటో చెల్లింపులు**

వర్తకులకు స్వయంచాలక (ఆటోమెటిక్) చెల్లింపులు లేదా నెలవారీ ఈఎంఐ, ఓటీటీల సబ్‌స్క్రిప్షన్ పునరుద్ధరణ, మ్యూచువల్ ఫండ్ పథకాల్లో క్రమానుగత పెట్టుబడులు (సిప్) వంటి పునరావృత చెల్లింపులను ఇకపై ఉదయం 10 గంటలకు ముందు లేదా రాత్రి 9.30 గంటల తర్వాతే ప్రాసెస్ చేయడం జరుగుతుందని ఎన్‌పీసీఐ తెలిపింది. వ్యవస్థపై లావాదేవీల ప్రాసెసింగ్ భారాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.

బ్యాంక్ అకౌంట్ వివరాలు యూపీఐ వినియోగదారులు ఇకపై తమ మొబైల్ నంబరుతో అనుసంధానితమైన బ్యాంకు ఖాతాల వివరాలను రోజులో గరిష్ఠంగా 25 సార్లు మాత్రమే పొందగలుగుతారు.

**పేమెంట్ స్టేటస్**

యూపీఐ వినియోగదారులు పెండింగ్‌లో ఉన్న లావాదేవీ స్టేటస్ (స్థితిని) కేవలం మూడు సార్లే చెక్ చేసుకునే వీలుంటుంది. అది కూడా, ఒకసారి పరిశీలించాక కనీసం 90 సెకన్ల తర్వాతే మళ్లీ చెక్ చేసుకోగలుగుతారు.

## రూ.1కే సరికొత్త 4జీ ప్లాన్ ప్రకటించిన బీఎస్ఎన్ఎల్..

# 30 రోజుల వ్యాలిడిటీ, రోజుకు 2జీబీ డేటా!

భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ వినియోగదారుల కోసం అద్భుతమైన ఆఫర్‌ను ప్రకటించింది. భారతదేశ 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వరంగ టెలికాం సంస్థ ప్రత్యేకంగా 'ఫ్రీడమ్ ప్లాన్' పేరుతో కొత్త ఆఫర్‌ను ప్రకటించింది. ఈ ప్లాన్ కింద వినియోగదారులు కేవలం రూపాయికే 30 రోజుల పాటు 4జీ సేవలను పొందే వీలు కల్పిస్తున్నది. అయితే, పరిమిత కాలం మాత్రమే అందు బాటులో ఉంటుంది. ఇటీవలే బీఎస్ఎన్ఎల్ దేశవ్యాప్తంగా తన స్వదేశీ 4జీ నెట్‌వర్క్‌ను విజయవంతంగా ఇన్‌స్టాల్ చేసింది. ఈ ఫ్రీడమ్ ప్లాన్‌లో భాగంగా వినియోగదారులకు అపరిమిత లోకల్-ఎస్టీడీ కాల్స్, రోజుకు 2జీబీ హైస్పీడ్ డేటా, రోజుకు వంద ఎస్ఎంఎస్‌లు, ఉచితంగా సిమ్ సైతం లభిస్తుంది. ఈ ఆఫర్ ఆగస్టు ఒకటి నుంచి 31 వరకు దేశవ్యాప్తంగా అందుబాటులో ఉంటుందని ప్రభుత్వరంగ సంస్థ తెలిపింది. ఈ ఆఫర్ కోసం యూజర్లు సమీపంలోని బీఎస్ఎన్ఎల్ ఔట్‌లెట్‌కు వెళ్లి కొత్త కనెక్షన్ తీసుకోవాల్సి ఉంటుందని.. రూపాయి చెల్లించి ప్లాన్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చని పేర్కొంది. అయితే, ఈ ప్లాన్‌లో కీలక కేవలంలో కొత్తగా బీఎస్ఎన్ఎల్ సిమ్ తీసుకునే వారికి




మాత్రమే వర్తించనున్నది. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ సేవలు వాడుతున్న లేదంటే ఇతర నెట్‌వర్క్ నుంచి పోర్ట్ అవ్వాలనుకునే వారికి ఈ ఆఫర్ వర్తించదని స్పష్టం చేసింది. ఈ ప్లాన్ ముగిసిన తర్వాత మిగతా సేవలను కొనసాగించేందుకు తప్పనిసరిగా రెగ్యులర్ ప్లాన్స్‌లో ఏదో ఒకదాన్ని రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్‌లో రూ.147 ప్లాన్‌తో రీచార్జ్ చేస్తే అన్‌లిమిటెడ్ కాల్స్‌తో పాటు రోజుకు 2జీబీ డేటా లభిస్తుంది.

బీఎస్ఎన్ఎల్ టైర్-2, టైర్-3 నగరాల్లో తన ఉనికిని బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నది. ఇందులో భాగంగా మేకిన్ ఇండియాలో భాగంగా తయారు చేసిన స్వదేశీ 4జీ టెక్నాలజీని వినియోగిస్తున్నది. డిజిటల్ ఇండియా దిశగా కీలక అడుగుగా పేర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా లక్షకుపైగా టవర్లు ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టింది. ప్రస్తుతం జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా వంటి ప్రైవేట్ సంస్థలు రూ.349, రూ.379, రూ.399లకు 4జీ ప్లాన్స్‌ని అందిస్తుండగా.. బీఎస్ఎన్ఎల్ మాత్రమే రూపాయికే కొత్త ప్లాన్ తీసుకువచ్చి ప్రైవేట్ సంస్థలకు షాక్ ఇచ్చింది. గమనించదగ్గ విషయం ఏంటంటే.. ప్రైవేట్ టెలికాం కంపెనీలు 5జీ సేవలతో పాటు ఓటీటీ యాప్‌లను కూడా ఉచితంగా అందిస్తున్నప్పటికీ.. బీఎస్ఎన్ఎల్ ప్రస్తుతం కేవలం 4జీ సేవలకే పరిమితమైంది. ఇటీవలి కాలంలో కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా బీఎస్ఎన్ఎల్ మొబైల్ సేవల బిజినెస్‌ను వచ్చే ఏడాది 50శాతంగా పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎంటర్‌ప్రైజ్ బిజినెస్‌ను 25-30శాతానికి, ఫిక్స్‌డ్ లైన్ బిజినెస్‌ను 15-20శాతం వరకు పెంచాలని సూచించారు.

# మాట కటువైతే... ముర్రి పాలు విరుగుతాయ్!

ప్రసవవేదనతో ప్రాణాల్ని తోడేసిన ఆ కొత్తబిడ్డలోకి తన ప్రాణాలు నింపి... తనలోంచి బయటకు తోడిన ప్రాణాలను మళ్లీ నెమ్మది నెమ్మదిగా పునఃప్రతిష్టించుకుంటూ ఉంటుంది అమ్మ. అలా అప్పుడప్పుడే కోలుకుంటున్న కీలక తరుణంలో ఆ అమ్మ పట్ల జడ్జిమెంటల్‌గా కొన్ని కామెంట్స్ చేయవద్దని కోరుతున్నారు మానసికవేత్తలు. ఆ పోస్ట్ పార్టమ్ 'బ్ల్యూ'స్ తాలూకు 'నీలి'నీడల్ని క్రమంగా బిడ్డపై ప్రేమ పెంచుకుంటూ ఇంద్రధనుస్సులాంటి ఫ్లయింగ్ కలర్స్‌గా మార్చుకునే తరుణంలో ఆ కామెంట్లు ఆమెలో అపరాధభావం నింపుతాయంటూ హెచ్చరిస్తున్నారు. సూచన అనే మారువేషం వేసుకుని కర్కశాన్ని కనిపించకుండా కప్పేస్తూ ఉండే... పలకకూడని ఆ పరుష పదాలేమిటో చూద్దాం. ఈనెల మొదటి తేదీతో మొదలై ఈ వారమంతా తల్లి పాల వారోత్సవాలు కొనసాగుతుంటాయి. ఈ సందర్భంగా బుజ్జాయికి తల్లి పాలే పట్టమంటూ సిఫార్సు చేస్తుంటారు డాక్టర్లు. 'బాటిల్ పాలు బొజ్జ నింపుతాయేమోగానీ... అమ్మ పాలు కడుపునింపడంతో పాటూ ఆత్మనూ నింపుతాయంటున్నారు' వైద్య నిపుణులు. ఈ సమయంలో కొన్ని మాటలు కొత్త తల్లితో చెప్పకూడదంటూ వారు సూచిస్తున్నారు.



**కొందరు పెద్దాళ్ల పెడసరం మాట**

ఇది ఎంతమాత్రమూ తల్లితో చెప్పకూడని మాట. బిడ్డకు తల్లి పాలను మించిన ఆహారం లేదు. డాక్టర్లు నిర్దిష్టంగా వద్దని చెబితే మినహా బిడ్డకు పాలుపట్టకుండా ఉండనే కూడదు. పైగా ముర్రి పాలతో పట్టే ముర్రు పాలు ఇంకా ఇంకా మేలూ మంచీ చేసేవే. ఆ ముర్రు పాలనే కొలెస్ట్రమ్ అంటారు. తల్లిని దేవత అన్నాక అమ్మ అమృతం పట్టక పోతే ఎలా! అందుకే అనేక అనారోగ్యాలూ... ఎప్పుడో వృద్ధాప్యంలో బిడ్డకు వచ్చే ఎన్నో జబ్బుల్నించి రక్షించే ఆ పాలు అమృతాలు కాకుండా ఎలా పోతాయి. అమృతానికి అంటు ఏమిటి? పాలకు మైలేమిటి? అందుకే తల్లి ఏ పరిస్థితుల్లో ఉన్నా బిడ్డకు అమ్మ పాలు పట్టాల్సిందే.

**ఏమో.... పట్టావో లేదో?"**

అనుభవజ్ఞురాలంటూ ఆరా తీసే మహిళ

పాలు తాగుతుండే పా పాయి చక్కగా బరువు పెరుగుతుంటే చాలు. పాలు తన ఒంటికి పడుతున్నట్టే లెక్క. తల్లి ఇచ్చే ఆ పాలబువ్వనంతా బిడ్డ ఒంటికంతా పట్టేలా ఏర్పాటు చేస్తుంది ప్రకృతి. అందుకే నెలల పా పాయిలకు మలవిసర్జన అంతగా కాక పోవచ్చు. కొన్నిసార్లు మల విసర్జనకు రెండు మూడురోజులూ పట్టవచ్చు లేదా రోజులో రెండుసార్లు కూడా కావచ్చు. కానీ మూత్రంతో రోజుకు ఆరుసార్లైనా డయపర్ తడిపేస్తుంది బేబీ! అలా రోజూ పాలు తాగే పసి పాప... రోజులో ఐదారుసార్లు పక్కతడిపేస్తుంటే చాలు.

ఇక పా పాయి ఏడుస్తుందంటే అర్థం పాలు సరి పోలేదని కాదు... అది కోలిక్ అని పిలిచే కడుపునొప్పి వల్ల కావచ్చు. చెప్పుకోలేని చెవినొప్పి ఉండచ్చు. అందుకే... పాప అదేపనిగా ఏడుస్తుంటే ఒకసారి చిన్నపిల్లల డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లాలి. అంతేతప్ప జడ్జిమెంటల్‌గా కామెంట్స్ పాస్ చేయకూడదు.

మా కాలంలో బిడ్డకు మూడేళ్లు వచ్చే వరకూ పట్టేవాళ్లమమ్మా..."

తమ కాలమైన గతమంతా గొప్పేనంటూ చెప్పే ఓ పెద్దావిడ మాట

బిడ్డకు ఆర్నెల్లు వచ్చేవరకూ పాలు పట్టడం తప్పనిసరి. చిన్నారి పా పాయికి పాలే సరైన ఆహారం. ఆర్నెల్ల తర్వాత నెయ్యీ పప్పూతో గుజ్జుగుజ్జుగా కలిపిన అన్నం గోరుముద్దలతోనూ, గుజ్జుగా నలిపే పండ్ల బువ్వతో క్రమంగా ఘనాహారమంటూ అలవాటు చేయడాన్ని ఇంగ్లిష్‌లో 'వీనింగ్' అంటారు. ఇలా చేస్తూ కూడా ఏడాది ఏడాదిన్నర వరకూ పాలు పడుతూనే ఉండవచ్చు. డాక్టర్ చెప్పిన ఏ కారణాల వల్లనో లేదా బిడ్డకు సరిపడా పాలు తల్లికి పడకనో ఆపేయాల్సి వస్తే... అందుకు అనేక కారణాలుండవచ్చు. అందుకే అదేదో నిష్ఠూరంగా ఎలా పడితే అలా మాట్లాడాల్సిన మాట కాదు.

"బిడ్డ బరువు సరిగా పెరుగుతున్నట్టుగా లేదు... పాలు సరిగా పట్టడం లేదా?"

%-% పెత్తనం చేస్తున్నట్టుగా పెదవి దాటించే ఓ పెద్దావిడ ఆరా!

బిడ్డకు పాలు సరి పోయాయంటే... కడుపు నిండిన వెంటనే పా పాయి కనీసం గంటా గంటన్నర పాటు నిద్ర పోతుంది. పాలు తాగాక కనీసం గంటసేపైనా పా పాయి పడుకుందంటే చిన్నారికి కడుపు నిండినట్టే లెక్క. కొందరు బిడ్డలు కాస్త పీలగా ఉండొచ్చు. అందరూ బొద్దుగానే ఉండరు కదా. అలా చూసి... ఇలా నిష్టూరాలు ఆడకూడదు. మొదట్లో ఒకవైపు పాలు తాగడానికి బిడ్డకు 20 నిమిషాల నుంచి 25 నిమిషాలూ పట్టవచ్చు. పాలు తాగే నైపుణ్యం పెరుగుతున్నకొద్దీ పా పాయి 5 %-% 10 నిమిషాల్లోనే పాలు తాగేస్తుంటుంది. అయితే... పాలు పట్టేటప్పుడు మొదట వచ్చే పాలను ఫోర్ మిల్క్ అంటారు. అందులో నీటి మోతాదు ఎక్కువగా ఉంటుంది. అది తాగేశాకే హైండ్ మిల్క్ అనే పాలొస్తాయి. ఇందులో బిడ్డ పెరుగుదలకు కావాల్సిన కొవ్వులు ఎక్కువగా ఉంటాయి. అవన్నీ కొవ్వులే అయినా పాప ఒంటికి హాయిగా పట్టేలా చేస్తుంది ప్రకృతి.

**కొత్త తల్లితో కినుక మాటలు ఎందుకు మాట్లాడకూడదంటే...**

కొత్త తల్లికి అంతా కొత్తే. కొంగులో బంగారు బిడ్డతో కొత్త తల్లికి అసలే కంగారు. పాప పుట్టే సమయంలో అనుభవించే వేదనతో కొన్నిసార్లు పాపపై కోపం వచ్చేలాంటి ' పోస్ట్ పార్టమ్ బ్లూస్' వర్కవుట్ అవుతూ ఉంటాయి. అవి క్రమంగా తగ్గుతుండే సమయంలో ఇలాంటి నిష్ఠూరాలతో అమ్మమనసుకు కష్టం కలిగిస్తాయి. అలాంటి వ్యాఖ్యలు ఆమెను మానసికంగా దెబ్బతీసి గిల్ట్‌ను నింపవచ్చు. మొదటే తెలియని తనం... అసలే అనుభవలేమి... పైగా ఇలాంటి మాటలు!! వీటితో ఆమెలో ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం దెబ్బతింటే ఇంకా ఇంకా సమస్యలు రావచ్చు. అందుకే అలాంటిలాంటి అనుచిత వ్యాఖ్యలు వద్దంటూ సూచిస్తున్నారు సైకియాట్రిస్టులు, సైకాలజిస్టులు.